శుక్రవారం
12-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 319
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మైన్మార్‌లో హింస ఆపండి
ఏషియన్ దేశాల పిలుపు

మైన్మార్‌లో హింసను, ఘర్షణలను ఆపాలని ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఏషియన్) నేతలు పిలుపునిచ్చారు. ప్రజాఘర్షణ అంతానికి చర్యల్లో ఎలాంటి పురోగతి లేదని ఇండోనేసియా అధ్యక్షుడు, ఏషియన్ నాయకుడు జోకో విడోడో వ్యాఖ్యానించారు.

2లో

జగన్ సర్కారుకి
మరో ఎదురుదెబ్బ

పాఠశాల విద్యాశాఖలో మున్సిపల్ స్కూళ్ల విలీనంపై హైకోర్టు స్టే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ ప్రభుత్వానికి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. గత ఏడాది జూన్‌లో మున్సిపల్ స్కూళ్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. మున్సిపల్ స్కూళ్ల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పురపాలక టీచర్స్ ఫెడరేషన్ (ఎంటీఎఫ్) అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం...రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2115 మున్సిపల్ పాఠశాలల విలీనంపై స్టే విధించింది. పురపాలక చట్టాలకు, 74 అధికరణానికి వ్యతిరేకంగా జీవో 84 ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. జీవో 180 ద్వారా పురపాలక పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పెత్తనానికి అవకాశం కల్పించడం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. జీవో 184 ప్రకారం విద్యాశాఖ నుంచి పురపాలక పాఠశాలల ఉపాధ్యాయుల జీతభత్యాలు

- మిగతా 2 లో

చుక్కల భూముల చిక్కులకు చెక్

2,06,171 ఎకరాలకు మోక్షం
నేడు సంపూర్ణ హక్కు అందించనున్న సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ...చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 97,471 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ దాదాపు రూ.20,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కును అందించే కార్యక్రమాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో శుక్రవారం సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. బ్రిటీష్ కాలంలో సుమారు వంద సంవత్సరాల క్రితం భూసర్వే జరిగినప్పుడు 'ప్రభుత్వ భూమి' లేదా 'ప్రైవేటు భూమి' అని నిర్ధారణ చేయని కారణంగా రెవెన్యూ రికార్డులలో (రీ సెటిల్మెంట్ రిజిస్టర్ ఆర్ఎస్ఆర్) పట్టాదారు గడిలో 'చుక్కలు' పెట్టి వదిలేశారు. ఆ భూములనే 'చుక్కల భూములు' అంటారు. దీనివల్ల సంపూర్ణ హక్కులు లేక దశాబ్దాలుగా రైతులు

ఆ భూములు అనుభవిస్తున్నా వాటిని అమ్ముకునే స్వేచ్ఛ లేక, సర్వ హక్కులు లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో వారి ఆస్థిపై పూర్తి హక్కులు యజమానికే చెందాలని రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ రైతన్నలు తిరిగే అవసరం లేకుండా, ఒక్క పైసా ఖర్చు లేకుండా దశాబ్దాల కాలం నాటి ఈ చుక్కల భూముల సమస్యలకు స్వస్తి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పాలనాధికారం
ఢిల్లీ ప్రభుత్వానిదే

- స్థానిక యంత్రాంగానికి ఎల్జీ కట్టుబడాలి
- శాంతిభద్రతలు, పోలీస్ వ్యవస్థపై అధికారం కేంద్రానిది
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ ▸ 'అధికార' వివాదానికి తెర

న్యూఢిల్లీ: పాలనాధికారం ఢిల్లీ ప్రభుత్వానిదేనని సర్వోన్నత న్యాయస్థానం గురువారం తేల్చిచెప్పింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికే సర్వాధికారాలు ఉంటాయని తెలిపింది. ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడాలని, శాంతి భద్రతలు మినహా అన్నీ ఢిల్లీ ప్రభుత్వం నియంత్రణలోనే ఉండాలని పేర్కొంది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక ఆప్ ప్రభుత్వాన్ని విజయం వరించింది. పబ్లిక్ ఆర్డర్, భూమి, పోలీసు వ్యవస్థ మినహా అన్ని సేవలు ఢిల్లీ ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అధికారాలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య 2015 నుంచి వివాదం కొనసాగుతూనే ఉన్నది. ఎనిమిదేళ్ల వివాదానికి సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ఐదుగురు సభ్యుల ధర్మాసనం తెరదించింది. ఐఏఎస్ లేక జాయింట్ కేడర్ సర్వీసెస్, బదిలీలు, నియామకాలు అన్నీ స్థానిక ప్రభుత్వం పరిధిలోనే ఉంటాయని పేర్కొంది. ప్రజాస్వామ్యం, ఫెడరలిజం సిద్ధాంతాలు మన రాజ్యాంగంలో ప్రధాన అంశాలని, బహుళ-సంస్కృతి, మతాలు, ఆచారాలు, భాషలున్న భారత్ వంటి దేశంలో ఫెడరలిజం వైవిధ్యతకు ప్రతీకని, ఫెడరల్ రాజ్యాంగంలో ద్వంద్వ పాలన గురించి ఉన్నదని (ఒకటి జాతీయ స్థాయిలో రెండు ప్రాంతీయ ఫెడరల్ యూనిట్ల స్థాయి) సుప్రీంకోర్టు వెల్లడించింది. లిస్ట్2 (పబ్లిక్ ఆర్డర్, పోలీస్,

- మిగతా 2 లో

గవర్నర్‌ది
తప్పుడు నిర్ణయమే

- పార్టీల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు
- ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేం
- బలపరీక్ష లేకుండా రాజీనామా చేయడమే కారణం
- రెబల్ ఎమ్మెల్యేల వ్యవహారం విస్తృత ధర్మాసనానికి బదిలీ
- మహారాష్ట్ర రాజకీయాలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని కూల్చడంలో గవర్నర్ కోషియారీ తీరు సరైనది కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. గవర్నర్‌కు రాజకీయాలు, పార్టీల అంతర్గత వ్యవహారాల్లోకి తలదూర్చే అధికా రం లేదని తేల్చిచెప్పింది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం కూల్చివేత పరిణామాలను తీవ్రంగా ఖండించింది. అప్పట్లో గవర్నర్‌గా ఉన్న భగత్ సింగ్ కోషియారి తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టింది. 'ఉద్ధవ్ ఠాక్రే మెజార్టీ కోల్పోయారని నిర్ధారణకు వచ్చేందుకు గవర్నర్ వద్ద తగిన సమాచారం లేనప్పుడు బలపరీక్షకు పిలవడం సబబు కాదు. గవర్నర్ విచక్షణాధికారాలను అమలు చేసిన తీరు చట్టవిరుద్ధమే అవుతుంది. పార్టీల అంతర్గత వివాదాలను పరిష్కరించడానికి బలపరీక్షను ఒక మాధ్యమంగా వాడరాదు. ఉద్ధవ్ ఠాక్రే బలపరీక్షను ఎదుర్కోకుండానే రాజీనామా చేయడం వల్ల ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించడం కుదరదు. ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేయడంతో ఏక్‌నాథ్ షిండేను ప్రభుత్వా న్ని ఏర్పాటు చేసేందుకు పిలవడం, ప్రమాణస్వీకారం చేయించడం సమర్థనీయమే. తిరుగుబాటు ఎమ్మెల్యేలపై తాము అనర్హత వేటు వేయలేము. అవిశ్వాస తీర్మానం ఎదుర్కొంటున్న స్పీకర్‌కు రెబల్ ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసులు జారీ చేసే అధికారాలు ఉంటా యా లేదా అన్న అంశాన్ని మరింత అధ్యయనం చేయాల్సి ఉన్నందున దీనిని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నాం' అని 141 పేజీల తీర్పులో సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్

- మిగతా 2 లో

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని
నేడే చలో సీఎం క్యాంప్ కార్యాలయం

- రైతులు భారీగా తరలిరావాలి: రామకృష్ణ పిలుపు
- ప్రారంభమైన గృహనిర్బంధాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 12వ తేదీ చేపట్టిన చలో సీఎం క్యాంప్ కార్యాలయం కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన అకాల భారీవర్షాల వల్ల రాష్ట్రంలో దాదాపు 6 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంద న్నారు. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో అప్పులు తెచ్చి పంటలు వేసిన రైతులు గగ్గోలు

- మిగతా 2 లో

అభివృద్ధి మరింత వేగవంతం

▸ సుప్రీం తీర్పుపై కేజ్రీవాల్ ▸ ప్రజాస్వామ్యం గెలిచిందన్న ఆప్ నేతలు

2లో

ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పునరుద్ధరించేలా సుప్రీం తీర్పు

2లో



ఇకనైనా గవర్నర్లు తీరు మార్చుకోవాలి

సీపీఐ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, ఢిల్లీ వ్యవహారాలకు సంబంధించి సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుతోనైనా గవర్నర్లు తమ తీరును మార్చుకోవాలని, లేదంటే ప్రజలు తిరగబడతారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర గవర్నర్ వ్యవహరించిన తీరుపై సుప్రీం కోర్టు సరైన తీర్పులు ఇచ్చిందన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ డిఫ్యాక్టో ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ ఎన్నికైన ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారాలను లాగేసుకున్నారని, దీనిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెళ్లిందన్నారు. ఎన్నికైన

- మిగతా 2 లో

దళారీల దగా

మధ్యవర్తుల మోసంతో మొక్కజొన్న రైతు గగ్గోలు
విదేశీ ఎగుమతికి అనుమతి లేదు
ఉత్పత్తి పెరిగింది... డిమాండ్ తగ్గింది

ఎన్నో ఆశలతో పంట పండించిన రైతులు ఈ ఏడాది తీవ్ర నిరాశకు గురయ్యారు. పెరిగిన ఉత్పత్తికి తగ్గట్టుగా డిమాండు లేకపోవటమే దీనికి కారణమని రైతులు అంటున్నారు. ఈ ఏడాది విదేశాలకు తరలించేందుకు ఇంకా అనుమతులు రాలేదు. ఎప్పుడు వస్తాయో? అసలు అనుమతులు ఉంటాయో? లేదో? తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

విశాలాంధ్ర-లింగపాలెం: రాష్ట్రంలో దేశవాళీ మొక్కజొన్న ఉత్పత్తి ఈ ఏడాది ఒక్కసారిగా పెరిగింది. రెండున్నర దశాబ్దాల నుంచి రైతులు ఈ పంట పండిస్తున్నారు. రెండేళ్లుగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంది. ఈ ఏడాది మరింత దిగుబడి పెరిగింది. దేశవాళీ మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో రెండో పంటగా సాగుచేస్తారు. ఖరీఫ్‌లో వరి సాగుచేయగా రెండో పంటగా మొక్కజొన్న పండిస్తున్నారు. ఈ పంటకు నీటి వినియోగం, పెట్టుబడి తక్కువ. దీనికితోడు నాలుగు నెలల్లో పంట చేతికి వస్తుంది. రాష్ట్రంలో మూడు, నాలుగు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో మొక్కజొన్న పంట పండిస్తున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగుచేస్తుండగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో దాదాపు లక్షా 50 వేల ఎకరాలలో ఈ పంట పండించారు. ఎకరాకి 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో దాదాపు 70 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎన్నో ఆశలతో పంట పండించిన రైతులు ఈ ఏడాది తీవ్ర నిరాశకు గురయ్యారు. పెరిగిన ఉత్పత్తికి తగ్గట్టుగా డిమాండు లేకపోవటమే దీనికి కారణమని రైతులు అంటున్నారు. గతంలో ఇక్కడ పండిన పంటను విదేశాలకు ఎగుమతి చేసుకొనేందుకు అనుమతి ఉండేది. బంగ్లాదేశ్, నేపాల్, మలేసియా తదితర దేశాలకు ఎగుమతి చేసేవారు. పంట నిల్వలు ఉండేవి కాదు. ఈ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

తడిసిన ధాన్యం కొంటామని ముఖ్యమంత్రి మాటమ్మెప్పోసారి హామీ ఇచ్చారు!

ఇమ్రాన్ ఖాన్ విడుదలకు సుప్రీం ఆదేశం

అరెస్టు తీరుపై ఆగ్రహం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ సుప్రీంకోర్టులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో కస్టడీ నుంచి విడుదలకు కోర్టు ఆదేశించింది. తమ చైర్మన్ అరెస్టును సవాల్ చేస్తూ పీటీఐ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు గంటలోగా ఇమ్రాన్‌ను తమ ఎదుట హాజరుపరచాలని ఆదేశాలు జారీచేసింది. విచారణ సందర్భంగా షెహబాజ్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అల్ ఖదీర్ ట్రస్ట్ అక్రమాల కేసులో ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్ ఖాన్‌ను కోర్టులోనే పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇమ్రాన్‌ను అరెస్టు చేసిన తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంది. దేశాన్ని కరాగారంగా మార్చాడాన్ని అనుమతించబోమని తెలిపింది. ఇమ్రాన్ ఖాన్ న్యాయవాది హమీద్ కోర్టులో వాదనలు వినిపించారు. ఆయన అరెస్టును తప్పుపట్టారు. జస్టిస్ మినల్లా స్పందిస్తూ గతంలో ప్రజాప్రతినిధులను అవమానకర రీతిలో ఎన్ఏబీ అరెస్టు చేసిందని, దీనికి ముగింపు పలకాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు తక్షణమే ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని ఆదేశించింది. శుక్రవారం ఇస్లామాబాద్ కోర్టును ఆశ్రయించాలని న్యాయస్థానం సూచించింది.

అస్థిరంగానే పాకిస్తాన్

2లో

దేశ చరిత్రలో చీకటి అధ్యాయం: హింసపై సైన్యం ప్రకటన

అస్థిరంగానే పాకిస్తాన్

ప్రధాని ఇంటిపై దాడి

పీటీఐ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖురేషి అరెస్టు

దేశ చరిత్రలో చీకటి అధ్యాయం: హింసపై సైన్యం ప్రకటన

ఇస్లామాబాద్/లాహోర్: పాకిస్తాన్ అస్తిరంగా ఉన్నది. తెహ్రీకే ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ అరెస్టుతో దేశం అట్టుడికిపోతోంది. ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చెందిన లాహోర్ ఇంటిపై పీటీఐ కార్యకర్తలు దాడి చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పుపెట్టారు. పెట్రో బాంబులతో విధ్వంసం సృష్టించారు. ప్రధాని ఇంటిపై దాడి జరిగిప్పుడు గార్డులు మాత్రమే ఉన్నారని, అక్కడి పోలీస్‌పోస్టుకూ నిరసనకారులు నిప్పుపెట్టారని పోలీసులు తెలిపారు. మరోవైపు పీటీఐ నేతల అరెస్టులపర్వం కొనసాగుతోంది. ఆ పార్టీ ఉపాధ్యక్షుడు, ఇమ్రాన్ ఖాన్‌కు సన్నిహితుడైన మహమ్మద్ ఖురేషీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్టు దృశ్యాలను ట్విట్టర్‌లో పీటీఐ షేర్ చేసింది. మఫ్టీలో వచ్చినవారు ఖురేషీని తీసుకెళ్తుండటం ఆ దృశ్యాల్లో కనిపిస్తోంది. తమ నాయకుడిని రహస్యంగా ఉంచారని పార్టీ ఆరోపించింది. ఇమ్రాన్ ఖాన్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఫవాద్ చౌధురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజా హింసాత్మక పరిస్థితులను పాకిస్తాన్ సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇది దేశ చరిత్రలోనే చీకటి అధ్యాయం అని అభివర్ణించింది. సైనిక ఆస్తులపై దాడులను ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల ఆందోళనలను ఉటంకిస్తూ పాకిస్తాన్ ఆర్మీ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఏ ఒక్కరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోడానికి అనుమతించబోం' అని తేల్చిచెప్పింది. నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) ప్రకటనను ఉటంకిస్తూ ఇమ్రాన్ ఖాన్ అరెస్టును సమర్థించింది. దేశ ప్రయోజనాల కోసం సైన్యం అత్యంత సంయమనాన్ని ప్రదర్శించి ఎంతో ఓర్పుతో పనిచేసిందని తెలిపింది. 'వ్యూహం ప్రకారమే సైన్యం ప్రతిస్పందనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే పరిస్థితి సృష్టించారు. దీనిని అడ్డుకున్నాం. సైన్యంతో పాటు వ్యవస్థలపై దాడులు జరిగితే కఠినమైన నిర్ణయాలు, చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించింది. కాగా, హింసలో ఇప్పటివరకు ఎనిమిది మంది మరణించగా అనేక మందికి గాయాలయ్యాయి. దాదాపు 2వేల మంది అరెస్టుకు గురయ్యారు. ఇమ్రాన్ ఖాన్‌కు స్థానిక కోర్టు ఎనిమిది రోజుల రిమాండ్ విధించింది.

పాక్ పరిస్థితిని గమనిస్తున్నాం: బ్రిటన్

పాకిస్తాన్ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ స్పందిస్తూ 'ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు ఆ దేశ అంతర్గత వ్యవహారం. అక్కడి పరిస్థితులను గమనిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే ఇమ్రాన్ ఖాన్ అరెస్టును అఫ్ఘాన్‌లో దౌత్యవేత్త జల్మే ఖలీల్జాద్ ఖండించారు. ఆయనను తక్షణమే విడుదల చేయాలని, కస్టడీలోనే చంపేస్తారన్న భయాందోళన పెరుగుతోందన్నారు.

గ్రీస్ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికల్లో మళ్లీ గెలిచిన పాన్స్‌పౌండస్టికి కేఎస్

ఏథెన్స్: కమ్యూనిస్టులు మద్దతిచ్చిన 'పాన్స్‌పౌండస్టికి కేఎస్' (ఆల్ స్టూడెంట్ కోఆపరేటివ్ మూవ్‌మెంట్) విజయపరంపర కొనసాగింది. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, టెక్నాలజికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో మరోసారి విజయాన్ని పాన్స్‌పౌండస్టికి కేఎస్' నమోదు చేసింది. ఈనెల 21న పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్న క్రమంలో 'పాన్స్‌పౌండస్టికి కేఎస్' తాజా గెలుపునకు ప్రాధాన్యత ఏర్పడింది. విద్య సంస్కరణలను కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ (ఎన్‌డీ) ప్రభుత్వం అమలు చేయనున్న తరుణంలో ఈ గెలుపు చాలా కీలకమైనదిగా పరిణమించింది. 272 విభాగాలకుగాను 255లో 'పాన్స్‌పౌండస్టికి కేఎస్' గెలిచింది. 35.15శాతం ఓట్లు పొందింది. ప్రభుత్వ అనుకూల డీఏపీకి 26.36శాతం, సామాజిక ప్రజాస్వామిక పీఏఎస్‌పీకి 9.67శాతం, ఈఏఏకే- ఏఆర్ఈఎన్‌కు 9.42శాతం, సిరిజా మద్దతున్న డిక్యోకు 2.41శాతం ఓట్లు వచ్చాయి. 2022లోనూ 'పాన్స్‌పౌండస్టికి కేఎస్'కు 34.07శాతం ఓట్లు రాగా డీఏపీకి 27.69శాతం లభించాయి. అయితే బుధవారం రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత వందలాది మంది విద్యార్థులు ఏథెన్స్ పాలిటెక్నిక్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. 'పాన్స్‌పౌండస్టికి కేఎస్' గెలుపు కొత్త ఆశలకు, సానుకూలతకు సందేశమని, తమ హక్కులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటాలకు విద్యార్థులు సిద్ధమని పాలక పక్షానికి సంకేతమని గ్రీస్ కమ్యూనిస్టు యూత్ (కేఎన్ఈ) కార్యదర్శి థోడోరిస్ కోట్సంటిస్ పేర్కొన్నారు.

మైన్మార్‌లో హింస ఆపండి

ఏషియన్ దేశాల పిలుపు

లబువాన్ బాజో: మైన్మార్‌లో హింసను, ఘర్షణలను ఆపాలని ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఏషియన్) నేతలు పిలుపునిచ్చారు. ప్రజాఘర్షణ అంతానికి చర్యల్లో ఎలాంటి పురోగతి లేదని ఇండోనేసియా అధ్యక్షుడు, ఏషియన్ నాయకుడు జోకో విడోడో వ్యాఖ్యానించారు. ఇండోనేసియా, తూర్పు నుసా తెంగ్గారా ప్రావిన్స్‌లోని లబువాన్‌బాజోలో రెండ్రోజుల 42వ ఏషియన్ సదస్సు సందర్భంగా గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జోకో మాట్లాడారు. 'నేను నా సహచర ఆసియా దేశాల నాయకులతో నిజాయితీగా చెబుతున్నా... మైన్మార్‌లో హింసను, ఘర్షణలను ఆపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఐదాంశాల రాజీ ప్రక్రియలో పురోగతి లేదు' అని అన్నారు. ఏషియన్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆయన మైన్మార్‌ను దృష్టిలో పెట్టుకొని పది దేశాలు రూపొందించిన శాంతి ప్రణాళికను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అన్ని పక్షాలను కలుపుకుని చర్చలు జరిగేందుకు, మానవతా సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని మైన్మార్ సైనిక ప్రభుత్వానికి సభ్యదేశాలతో కలిసి సూచించారు. 'మైన్మార్‌లో జరుగుతున్న హింసను తక్షణమే ఆపాలని కోరుతున్నాం. జాతీయ చర్చలకు వీలు కల్పిస్తూ, సురక్షితంగా, సకాలంలో మానవతా సాయం అందేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోండి' అని మైన్మార్ ప్రభుత్వాన్ని ఏషియన్ దేశాలు కోరాయి.

అభివృద్ధి మరింత వేగవంతం

సుప్రీం తీర్పుపై కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పాలనా సర్వీసులపై స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వానికే అధికారాలు ఉంటాయంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఢిల్లీ ప్రజలకు న్యాయం లభించిందని, ఇందుకు సుప్రీం కోర్టుకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. తాజా నిర్ణయంతో దేశ రాజధాని అభివృద్ధి వేగం మరింత పుంజుకుంటుందని కేజ్రీవాల్ ఆశాభావం వెలిబుచ్చారు. మరోవైపు...అధికారుల నియామకాలు, బదిలీల అధికారం ఎన్నికైన ప్రభుత్వానికి దక్కిందని 'ఆప్' పేర్కొంది. కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కి... అధికారులపై ఎటువంటి నియంత్రణ ఉండదని 'సుప్రీం' తీర్పును ఉటంకించింది. రాజ్యాంగ వ్యతిరేక పద్ధతుల ద్వారా ప్రభుత్వాలను కూల్చివేసే శక్తులకు సుప్రీంకోర్టు తీర్పు పెద్ద చెంపదెబ్బ అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేజ్రీవాల్ కేబినెట్ మంత్రులతో సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు తీర్పును ఆప్ అధికారిక ట్విట్టర్ ద్వారా స్వాగతించింది. ఢిల్లీ ప్రజలకు పనిచేయకుండా ఆపేందుకు అధికారులపై లెఫ్టినెంట్ గవర్నరుకు ఎలాంటి అధికారం లేదని ఆప్ పేర్కొంది. తాజా తీర్పును ఆప్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కీలకంగా అభివర్ణించారు.

'సత్యమేవ జయతే. ఢిల్లీ గెలిచింది. ఇక్కడి అధికారులు...స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవలందించాలని... పాలనను స్తంభింపజేసేందుకు కేంద్రం నియమించిన, ప్రజలు ఎన్నుకోని వ్యక్తుల (ఎల్‌జీ) ద్వారా కాదన్న కఠిన సందేశాన్ని తాజా తీర్పు పంపుతోంది' అని పేర్కొన్నారు. సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీం కోర్టు... తమ ప్రభుత్వానికి దాని హక్కును కట్టబెట్టిందని ఆప్ సీనియర్ నేత, మంత్రి అతిషీ వ్యాఖ్యానించారు. 'సీఎం కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల కోసం ఎనిమిదేళ్ల న్యాయ పోరాటం చేశారు. ఈరోజు ప్రజలు గెలిచారు' అని మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ ట్వీట్ చేశారు.

ఆప్ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ రాయ్ స్పందిస్తూ...సుప్రీం తీర్పు మోదీ ప్రభుత్వానికి చెంపదెబ్బని వ్యాఖ్యానించారు. లెఫ్టినెంట్ గవర్నరు, కేంద్ర హోంమంత్రిత్వశాఖ ద్వారా ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను మోదీ ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకోవాలని కోరుకుందని, కానీ సుప్రీంకోర్టు ఆ ఆశలపై నీళ్ల చల్లిందని విమర్శించారు. ప్రభుత్వాలను అస్థిరపరచడం ద్వారా మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని చీకటిలోకి నెట్టేసిందని మండిపడ్డారు.

దళారీల దగా

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది విదేశాలకు తరలించేందుకు ఇంకా అనుమతులు రాలేదు. ఎప్పుడు వస్తాయో? అసలు అనుమతులు ఉంటాయో? లేదో? తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకేసారి పంట దిగుబడి రావటంతో దళారీల హవా కొనసాగుతోంది. వచ్చిన పంటను భద్రపరచుకొనే అవకాశం రైతులకు లేదు. సరైన ధర వచ్చే వరకు పంట దాచుకోవటానికి గోదాముల సౌకర్యం లేదు. మార్కెట్ యార్డుల గోదాములున్నా మొక్కజొన్న రైతులకు ఉపయోగపడటం లేదు. ఒకప్పుడు మార్కెట్ యార్డులో పంట దాచుకుంటే, ఆ పంటకు రుణాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆలస్యమైంది. ఇదే అదునుగా భావించి దళారీలు రంగంలోకి దిగారు.

పంట నిల్వ చేసుకునే అవకాశంలేని రైతులు తక్కువ ధరకే విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. క్వింటాకు రూ.2 వేలు లభిస్తే రైతులకు ఆశాజనకంగా ఉంటుంది. కానీ దళారీలు క్వింటాను రూ.1700లకే కొనుగోలు చేసి...నిల్వ చేసుకుంటున్నారు. దళారీలకు అమ్మటం వల్ల ఎకరాకి రూ.10 వేల మేరకు రైతుకు నష్టం వస్తుంది. రాష్ట్రం మొత్తం మీద రైతుల సొమ్ము దాదాపు రూ.200 కోట్లు దళారీలపరమవు తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఉత్పత్తికి తగ్గట్టుగా ప్రభుత్వం డిమాండు చూపించకపోతే మొక్కజొన్న రైతులు నష్టపోతారు. మొక్కజొన్న పంట రైతులకు ఆసరాగా ఉంది. ఈ పంట కోళ్ల ఫారాలకు, పశువుల దాణాకు, ఇతర పోషక ఆహారంగా ఉపయోగపడుతుంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే రైతులు మొక్కజొన్నపై ఆసక్తి చూపని ప్రమాదం ఉంది. వీటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'దాస్ కాపిటల్' చదవడం సులభమే!

సులభ పరిచయ తరగతులలో బ్రహ్మాచారి, డీవీఎస్ వర్మ వివరణ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: తనచుట్టూ నివసిస్తున్న శ్రామికప్రజల జీవితాలను ఆధారం చేసుకునే కారల్ మార్బ్ 'దాస్ కాపిటల్' గ్రంథాన్ని రచించారని, తమ జీవితం గురించే రాసిన "దాస్ కాపిటల్" గ్రంథాన్ని కార్మికులు చదవడం సులభమేనని విశ్రాంత అధ్యాపకులు ఇఎస్ బ్రహ్మ చారి అన్నారు. సామాన్యులు "దాస్ కాపిటల్" చదవడం కష్టమనే భావనను విడిచిపెట్టాలని ఆయన సూచించారు. ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియాకమిటీ ప్రతి వారం నిర్వహిస్తున్న "లేబర్ స్కూల్" లో ఈవారం వక్తగా ఒంగోలుకు చెందిన విశ్రాంత అధ్యాపకులు, "కారల్ మార్బ్ "పెట్టుబడి" గ్రంథంలో ఏం చెప్పాడు" గ్రంథరచయిత ఇ.ఎస్. బ్రహ్మాచారి హాజరయ్యారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు డీవీవీఎస్ వర్మ అతిథిగా పాల్గొన్నారు. లేబర్ స్కూల్ నిర్వాహకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ స్వాగతం పలుకుతూ 2022 ఆగస్టులో ప్రారంభించిన లేబర్ స్కూల్‌లో వారానికి ఒక ఒక గంట చొప్పున ఇంతవరకూ 37 వారాలపాటు తరగతులు అంతరాయం లేకుండా జరిగాయని తెలిపారు. మే 9 నుంచి కారల్ మార్బ్ రచన "దాస్ కాపిటల్" సులభ పరిచయ తరగతులు ప్రారంభ మయ్యాయని, ఆరు నుంచి పది వారాలపాటు ఇవి కొనసాగుతాయని సోమసుందర్ వివరించారు. బ్రహ్మ చారి మాట్లాడుతూ కారల్ మార్బ్ , ఎంగెల్స్ రచించిన "కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక, మార్బ్ రచించిన "దాస్ కాపిటల్" గ్రంథాలను కార్మికవర్గం విధిగా చదవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రమ, సరుకు , కూలి , విలువ , అదనపు విలువ, డబ్బు, పెట్టుబడి వంటి కార్మికుల రోజువారీ జీవితానికి సంబంధించిన విషయాలనే మార్బ్ తన గ్రంథంలో విశ్లేషించారని తెలిపారు. 18, 19వ శతాబ్దాలలో కార్మికుల పనిపరిస్థితులు అధ్వాన్నంగా ఉండేవని నిర్దిష్ట పనిగంటలు లేవని, లాభాలు గడించేందుకు యజమానులు కార్మికులశ్రమని దారుణంగా కొల్లగొట్టే వారని వివరించారు. యాజమానుల లాభాలకు, కార్మికుల జీవన స్థితిగతులకు మధ్య తలెత్తిన వైరుధ్యమే వర్గపోరాటానికి మూలమని బ్రహ్మ చారి వివరించారు. ప్రస్తుతం తిరిగి పాతకాలం నాటి దుర్భరపరిస్థితులు పునరావృతం అవుతున్నాయని, సంక్షోభాలు పెట్టుబడిదారీ సమాజపు పునాదుల్ని కుదిపి వేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ సోవియట్ యూనియన్ లో కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత కారల్ మార్బ్ సిద్ధాంతాలకు కాలం చెల్లిందన్న వాదనలు తలెత్తాయని గుర్తుచేశారు. అయితే పెట్టుబడిదారీసమాజంలో తరచూ తలెత్తుతున్న సంక్షోభాలవల్ల కార్మికుల స్థితిగతులు, దిగజారుతున్నాయని, నిరుద్యోగం, అసమానతలు, వివక్షతలు పెరుగుతున్నాయని, దాంతో ఆయా సమస్యల పరిష్కారాల కోసం ఇప్పుడు మళ్లీ మార్బ్ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నారని వర్మ వివరించారు. అమెరికాలో 38 యూనివర్సిటీలలో "కమ్యూనిస్టు మానిఫెస్టో" పాఠ్య గ్రంథంగా ఉందని తెలిపారు. అయితే మార్బ్ సిద్ధాంతాలు ఎవరిని ఉద్దేశించి రాశారో ఆ శ్రామికవర్గానికి వాటిని అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. తాడేపల్లిగూడెంలో "లేబర్ స్కూల్" పేరుతో ఏఐటీయూసీ ఏరియా కమిటీ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని వర్మ అన్నారు. కార్మికుల కోసం "దాస్ కాపిటల్" సులభపరిచయ తరగతుల ఏర్పాటు ప్రయోగం రాష్ట్రంలో ఇదే ప్రథమమని దీన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పొలిరాతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలనాధికారం ఢిల్లీ ప్రభుత్వానిదే

(మొదటిపేజీ తరువాయి)

భూమి) మినహా లిస్ట్ 2, లిస్ట్ 3 (రాష్ట్ర, కాన్‌కరెంట్ లిస్ట్) ఎన్‌సీటీడీ (నేషనల్ క్యాపిటల్ టెరిటరీ అడ్మినిస్ట్రేషన్) శాసనసభ పరిధిలో ఉంటాయని గురువారం వెలువరించిన 105 పేజీల తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అసలైన అధికారాలు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల వద్ద ఉండాలని పేర్కొంది. పాలనా వ్యవహారాలపై నియంత్రణ కూడా వారిదే అయివుండాలని, ఎన్నికైన ప్రభుత్వం నిర్ణయాలకు ఎల్‌జీ కట్టుబడి ఉండాలని తెలిపింది.

అధికారులు... మంత్రులకు నివేదించకపోతే, వారి ఆదేశాలను పాటించకపోతే, సమగ్ర పాలనా విధానాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని వెల్లడించింది. దేశంలోని ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా దేశ రాజధాని ఢిల్లీ ఉండదని, ఇది ప్రత్యేకమని, పబ్లిక్ ఆర్డర్, భూమి, పోలీసు వ్యవస్థపై అధికారాలు కేంద్రం వద్ద ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం వివరించింది.

ఇతర రాష్ట్రాల్లానే ఢిల్లీలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే ఉంటుంది కాబట్టి పాలనా అధికారాలు స్థానిక ప్రభుత్వానికే ఉంటాయని స్పష్టంచేసింది. తమను ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయడం ఎన్నికైన ప్రభుత్వ బాధ్యతని తెలిపింది. ఆయా సేవలపై ఢిల్లీ ప్రభుత్వానికి అధికారాలు లేవని 2019లో జస్టిస్ అశోక్ భూషణ్ ఇచ్చిన తీర్పును విస్తృత ధర్మాసనం తోసిపుచ్చింది. కాగా గతేడాది మే6న కూడా ఢిల్లీ అధికారాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపింది.

ఇక అధికారులంతా దార్లోకి రావాల్సిందే: స్పీకర్

న్యూఢిల్లీ: సభా కమిటీల ఎదుట హాజరుకాని బ్యూరోక్రాట్లంతా 'దార్లోకి రావాలి' అని ఢిల్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ అన్నారు. బదిలీలు, నియామకాలు ఢిల్లీ ప్రభుత్వ పరిధిలోకి వచ్చాయి కాబట్టి అధికారులంతా సరిగ్గా పనిచేస్తారన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలతో ఆగిన పనులు తిరిగి ప్రారంభమవుతాయని, యోగా తరగతులను పునరుద్ధరిస్తామని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లలో మందులు, వైద్యుల కొరత ఏర్పడిందని, మూడు నెలలుగా చెల్లింపులు జరగలేదని, వాటిని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి అప్పట్లో నిలిపివేశారని, సీనియర్ సిటిజన్స్‌కు నాలుగు నెలలుగా పింఛన్లు లేవని, ఇవన్నీ ఇప్పుడు గాడిలో పడతాయని స్పీకర్ అన్నారు. ఢిల్లీ ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించిన కొన్ని గంటల్లోనే స్పీకర్ రామ్ నివాస్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక ఆప్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిపాలనను అందించగలదన్నారు. అధికారులంతా పనులను సక్రమంగా, వేగవంతంగా చేస్తారని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా సమగ్ర పరిపాలన అందిస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు తన చేతులు కట్టేసివుండటం వల్ల ఏమీ చేయలేని పరిస్థితి ఉండేదని, ఇకపై ఢిల్లీలో పనులగతి అనేకరెట్లు పెరగబోతోందన్నారు.

నేడే చలో సీఎం క్యాంప్ కార్యాలయం

(మొదటిపేజీ తరువాయి)

పెడుతున్నారని తెలిపారు. రైతులు నష్టపోయిన ఉద్యానవన పంటలకు రూ.లక్ష, ఆహార పంటలకు ఎకరానికి రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి నుంచే గృహనిర్బంధాలను పోలీసులు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సీపీఐ, రైతు సంఘం నాయకుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్టు చేశారు.

తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శి తాటిపాక మధును ఇంటికి వచ్చి నోటీసు ఇచ్చి అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా సీపీఐ కార్యదర్శి కె. బోడకొండను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు మరికొంత మంది నాయకులను గురువారం రాత్రి ముందస్తుగా అరెస్టు చేశారు. రైతుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే అరెస్టు చేయడాన్ని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. అరెస్టుల ద్వారా ప్రజాకార్యక్రమాలను అడ్డుకోవాలన్న దుష్టవిధానాన్ని ప్రభుత్వం విడనాడాలని సూచించారు.

గవర్నర్‌ది తప్పుడు నిర్ణయమే

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణ మురారీ, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం వెల్లడించింది. మంత్రిమండలి సలహాలు, సూచనలు లేకుండా స్వతహాగా నిర్ణయాలు తీసుకొనేలా గవర్నర్ అసాధారణ రీతిలో వ్యవహరించారని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి హానికరమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 'గవర్నర్ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా ఉండాలి. ఆయనది రాజ్యాంగబద్ధ హోదా. ఆయన తన అధికార పరిధికి కట్టుబడాలి. రాజ్యాంగంగానీ చట్టంగానీ ఇవ్వని అధికారాన్ని ఆయన వినియోగించరాదు. రాజ్యాంగంగానీ ఏదేని చట్టంలోగానీ ఒక రాజకీయ పార్టీలో చీలిక ఏర్పడితే దానిని పరిష్కరించవచ్చని చెప్పలేదు. రాజకీయాల్లో - పార్టీల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా గవర్నర్‌కు అధికారం ఇవ్వలేదు' అని పేర్కొంది. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి స్వతహాగానే చట్టసభల మద్దతు ఉంటుందన్న భావన బలంగా ఉన్నదని, దీనిని పోగొట్టడం అవసరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజకీయ పార్టీల రాజ్యాంగం లేక అవి ఎంపిక చేసుకునే మార్గాల ద్వారా పార్టీల్లో వివాదాలు పరిష్కరించుకోవాలేగానీ ఇందుకు బలపరీక్షను మాధ్యమంగా చేసుకోవడం సరైన పద్ధతి కాదని పేర్కొంది. ఏదిఏమైనా పార్టీలోని ఓ వర్గం చెప్పినది విని సభలో మెజారిటీని ఠాక్రే కోల్పోయినట్లు నమ్మడం గవర్నర్ చేసిన తప్పేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అయితే ఠాక్రే ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని కోర్టు తెలుపడంతో ఏక్‌నాథ్ షిండేనే ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు.

ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని

పునరుద్ధరించేలా సుప్రీం తీర్పు

షిండే, ఫడ్నవీస్ రాజీనామా చేయాలి: ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పునరుద్ధరించే విధంగా సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువరించిందని శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే గురువారం వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు కారణంగా ఎంవీయే ప్రభుత్వం కూలిపోవడంతో నెలకొన్న రాజకీయ సంక్షోభంపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పును ఆయన స్వాగతించారు. అప్పట్లో గవర్నర్‌గా ఉన్న భగత్ సింగ్ కోషియారీ తీరును కోర్టు తప్పుపట్టింది. బలపరీక్షలో ఠాక్రే ఓడినట్లు ఎలా నిర్ణయించారని, అందుకు ఆయన వద్ద సరైన కారణాలు కూడా లేవని పేర్కొంది. మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై పిటిషన్లను సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించింది. ఏకగ్రీవంగా తీర్పును వెలువరించింది. శివసేన విప్‌గా షిండే వర్గానికి చెందిన భరత్ గోగావలేను నియమించేలా స్పీకర్ తీసుకున్నది తప్పుడు నిర్ణయమని తేల్చింది. తాజా పరిణామం క్రమంలో ఉద్ధవ్ ఠాక్రే తన నివాసం (మాతోశ్రీ బంగళాలో) విలేకరులతో మాట్లాడుతూ 'వారు (శిండే వర్గ ఎమ్మెల్యేలు) పార్టీకి, నా తండ్రి వారసత్వానికి వెన్నుపోటు పొడిచారు. నేను సీఎంగా రాజీనామా చేయడం చట్టబద్ధంగా తప్పే అయివుండవచ్చుగానీ నేను నైతిక కారణాలతో ఆ పని చేశాను. వెన్నుపోటుపొడిచే వారితో కలిసి ప్రభుత్వాన్ని ఎలా నడపగలను! ప్రస్తుత సీఎం (షిండే), ఉపముఖ్యమంత్రి (దేవంద్ర ఫడ్నవీస్)కు నైతికత ఉంటే సుప్రీంకోర్టు తీర్పు తర్వాత రాజీనామా చేయాలి' అని అన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. ఆయన సునీల్ ప్రభును శివసేనకు విప్‌గా పరిగణనించాలి, 16 మంది రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు గురించీ ఆలోచించాలి' అని ఠాక్రే అన్నారు. ఉద్ధవ్ ఠాక్రే తనంతటతానుగా రాజీనామా చేశారు కాబట్టి ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గతేడాది జూన్30న అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోవాలని అప్పటి సీఎం ఠాక్రేకు గవర్నర్ కోషియారీ సూచించడం తప్పు. యథాతథ స్థితికి ఆదేశాలివ్వలేం. బలపరీక్ష జరగలేదు... ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేశారు. కాబట్టి ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేం' అని ఎర్కొంది.

జగన్ సర్కారుకి మరో ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

చెల్లింపు చేయకూడదనే అంశంపైనా పిటిషనర్‌తో ఏకీభవించిన హైకోర్టు...మున్సిపల్ పాఠశాలలను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తూ ఇచ్చిన జీవోని నిలిపివేసింది. మున్సిపల్ పాఠశాలల విలీనానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారు. దాదాపు కోటి 30 లక్షల మంది పట్టణ జనాభాలో 5 లక్షల మంది పిల్లలు మున్సిపల్ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్నారు. వారిలో 95 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలు ఉన్నారు. మున్సిపల్ స్కూళ్ల ఆస్తుల కోసమే విలీనం అంటూ అప్పట్లో ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ జగన్ సర్కార్ మొండిగా వ్యవహరిస్తూ జీవో 84 ఇచ్చింది.

ఇకనైనా గవర్నర్లు తీరు మార్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలకు ఉండే అధికారాలలో జోక్యం చేసుకునే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కి లేదని తీర్పు నివ్వడాన్ని స్వాగతించారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని కూలగొట్టిన సమయంలో గవర్నర్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నారాయణ సమర్థించారు. భారత రాజ్యాంగం సమాఖ్య వ్యవస్థతో కొనసాగుతున్నదని స్పష్టగా చెబుతోందని, అయినప్పటికీ ఎన్నికైన ప్రభుత్వాల హక్కులను గవర్నర్ లాగేసుకోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే తెలంగాణ, తమిళనాడు, కేరళ గవర్నర్లు ఆయా అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను నెలల తరబడి ఆమోదించకుండా పెండింగ్ పెట్టారని, అలాగే రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలను రెచ్చగొటే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

రాష్ట్రం, రాజ్యాంగం గెలుపు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర రాజకీయ వివాదంపై సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రం, రాజ్యాంగం గెలిచాయని కాంగ్రెస్ గురువారం వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న 300 పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ ట్వీట్ చేశారు. 'సాక్ష్యాధారాలన్నీ మాకు అనుకూలంగా ఉన్నాయి. గవర్నర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ తప్పుడు విప్‌ను నియమించారు. ఇది మహారాష్ట్ర, రాజ్యాంగం గెలుపు' అని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునూ స్వాగతించారు. ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వం... ఢిల్లీ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కోర్టు చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

జూన్ నుంచి ప్రజల్లోకి...

- రాష్ట్రం కోసమే పొత్తులు
- వైసీపీ విముక్త రాష్ట్రానికి కట్టుబడి ఉన్నా
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

మాట్లాడుతున్న పవన్‌కల్యాన్. పక్కన నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-మంగళగిరి: కష్టపడి పనిచేస్తే ముఖ్యమంత్రి పదవి తనంతట తానే మనవద్దకు వస్తుందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి పదవి ఇస్తేనే పొత్తు పెట్టుకోవాలని కొందరు చెబుతున్నారని, గత ఎన్నికల్లో 30 నుంచి 40 స్థానాలు గెలిచి ఉంటే ఆ వాదనకు బలం చేకూరేదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి వరించాలి తప్ప దానికోసం తాను వెంపర్లాడబోనని చెప్పారు. తమ గౌరవానికి ఇబ్బంది లేకపోతే కలిసి ముందుకు వెళతామని పవన్ కల్యాణ్ తెలిపారు. వైసీపీ దాష్టికాలను బలంగా ఎదుర్కొంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేసులో తాను లేనని చెబితే కొందరికి ఆనందంగా ఉంటుందన్నారు. తనను ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ, బీజేపీలను అడగబోనన్నారు. పొత్తులపై కూర్చుని మాట్లాడుకుంటామని, అవసరమైతే ఒప్పిస్తామన్నారు. ముందస్తు ఎన్నికలు వస్తే జూన్ నుంచి ఇక్కడే ఉండి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని పునరుద్ఘాటించారు. 2019లో 137 స్థానాల్లో పోటీ చేసి పార్టీని పూర్తిస్థాయిలో నిలబెట్టామని, ఇప్పుడు పార్టీ మీద విమర్శలు చేస్తున్న వారు ఎవరూ అప్పుడు తనతో నిలబడలేదన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30-40 స్థానాలు గెలిచి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాను మాట్లాడుతానన్నారు. ప్రస్తుతం జనసేన పార్టీ బలం పెరిగిందని, తమకు పట్టున్న ప్రాంతాల్లో 36 శాతం వరకు ఉందన్నారు. బలం చూపించి పదవి తీసుకోవాలి తప్ప...షరతులతో పని జరగదన్నారు. బలమైన సమూహంతో అసెంబ్లీకి వెళ్లాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పొత్తులు అంత తేలిక కాదని, టీఆర్ఎస్ కూడా పొత్తులతోనే బలపడిందని గుర్తుచేశారు.

ప్రతి గింజా కొనే వరకు రైతుకు అండ

అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించేందుకు తూర్పు గోదావరి జిల్లా పర్యటనకు వెళ్లానని, కొన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఐదు నియోజకవర్గాల రైతులతో నేరుగా మాట్లాడానన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు ప్రభుత్వాన్ని దూషించడం తన లక్ష్యం కాదని, పాలకులు ఎంత త్రికరణ శుద్ధిగా ఉన్నారన్నదే ముఖ్యమన్నారు. వ్యవసాయ శాఖ పనిచేయడం లేదని, రైతుల సాధకబాధకాలు తెలుసుకోవడం లేదని విమర్శించారు. దళారీ వ్యవస్థ వల్ల రైతాంగానికి నష్టం కలుగుతోందన్నారు. పది రోజుల నుంచి గోనె సంచులు అడుగుతుంటే ఇవ్వలేదని, తాము వస్తున్నామనగానే రాత్రికి రాత్రి గోనె సంచులు ఇచ్చారన్నారు. తన పర్యటనను ప్రకటించిన తర్వాత తొలకరి పంట డబ్బు వేశారన్నారు. రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరున్న ఉభయ గోదావరి జిల్లాలను వైసీపీ ప్రభుత్వం ఎండగట్టేసిందని ఆరోపించారు. పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసే వరకు జనసేన పార్టీ రైతులకు అండగా నిలబడుతుందని పవన్ చెప్పారు.

ఇంటర్ విద్య ప్రక్షాళనపై తల్లిదండ్రుల కమిటీ హర్షం

విశాలాంధ్ర-విజయవాడ: ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు, కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలపై యుద్ధం ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డుకి, కార్యదర్శికి రాష్ట్రంలోని విద్యార్థి తల్లిదండ్రుల కమిటీ మద్దతు తెలియజేసింది. ఈ మేరకు పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షులు ఎస్ నరహరి, కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ఇంటర్మీడియేట్ బోర్డుకు కొన్ని సూచనలు చేస్తూ గురువారం లేఖ రాశారు. 2023-24 వ విద్యా సంవత్సరంలో కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ కళాశాలలో రెన్యువల్ చేసుకోవాలంటే.. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపల్ కమిషనర్/ జిల్లా పంచాయతీ అధికారి/ జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి పరిశీలన చేసిన అనంతరం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ పరిశీలన జయప్రదం కావాలని అకాంక్షించారు. కార్పొరేట్ జూనియర్ కాలేజి లను మొదటి ప్రాధాన్యతగా, మిగిలిన ప్రైవేటు కాలేజీలను పర్యవేక్షణ పరిశీలన జరపాలని కోరారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా ఫీజుల నియంత్రణ, రిజర్వేషన్ల అమలు నోటీసు బోర్డులపై ప్రకటన తదితర అంశాలను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ, కళాశాలల సమయంలో ,బోర్డు అనుమతి తీసుకున్న కళాశాలలో ఎంసెట్, నీట్ ఐఐటి కోచింగ్ లను అడ్డుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కార్పొరేట్ ప్రైవేటు కళాశాలలకు అనుబంధంగా అనుమతులు లేకుండా నడుపుతున్న హాస్టల్లో నియంత్రించాలన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధే జీసీసీ లక్ష్యం

ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యంగా జీసీసీ పనిచేస్తోందని, కొండకోనల్లో, అడవుల్లో కనీస సదుపాయాలు, రహదారులు లేనిచోట కష్టపడి పనిచేసే గిరిజన సహకార సంస్థ ఉద్యోగుల సేవలు మరువలేనివని ఉపముఖ్యమంత్రి, గిరిజనశాఖ మంత్రి పీడక రాజన్న దొర అన్నారు. దశపల్లా హోటల్లో గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో పీడిక రాజన్నదొర చేతుల మీదుగా జీసీసీ ఉద్యోగులు, వారి కుటుంబాలకి ఆరోగ్యకార్డులు ఆవిష్కరించారు. జీసీసీ నూతన ఉత్పత్తులను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, కళావతి, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్, డైరెక్టర్లు ఆవిష్కరించారు. హ్యాండ్ వాష్, ఫ్లోర్ క్లీనర్, డిష్ వాష్, హెర్బల్ హెయిర్ ఆయిల్‌తో పాటు మరికొన్ని గిరిజన ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేశారు. గిరిజనలు పంటలకు మద్దతు ధర ఇస్తూ, దళారుల బారి నుంచి గిరిజనులను జీసీసీ కాపాడుతోందని రాజన్నదొర అన్నారు. జీసీసీలో 438 మంది ఉద్యోగులు ఉన్నారని, మరో 600 ఖాళీలు ఉన్నాయన్నారు. తాను అడవుల్లో ఉద్యోగం చేశానని, గిరిజన ప్రాంతాల్లో ఉన్న కష్టాలు అనుభవించానన్నారు. ఆన్‌లైన్‌లో జీసీసీ ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పండుతున్న ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తున్న సంస్థ ఇదేనన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన సహకార సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు.

పాలకుల విధానాలపై పోరు

ఈశ్వరయ్య పిలుపు

మాట్లాడుతున్న ఈశ్వరయ్య, పక్కన ఎస్ఎన్ రసూల్, ఎస్ మునెప్ప తదితరులు

విశాలాంధ్ర - కోడుమూరు: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, వీటిపై ఉధృత పోరాటాలు జరిపేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా కోడుమూరులోని సీపీఐ కార్యాల యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకొచ్చిన నాటి నుంచి నరేంద్ర మోదీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, మైనార్టీలు, దళితులు, రచయితలు, మేధావులపై,మహిళలపై, అనేక రకాల అత్యాచారాలు కొనసాగిస్తూ అక్రమాలకు పాల్ప డుతూ దేశంలో అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉన్న ప్రజా సంపదనంతా ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్తూ ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, రైళ్లు తదితర ప్రభుత్వ సంస్థలు అన్నిటిని ప్రైవేట్ పరం చేసి తమ మిత్రులైన ఆదాని,అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వంతో పోరాడుతానని, వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా ఊసే జగన్ పలకడం లేదన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కేంద్రంలో బీజేపీ అక్రమాలకు వంతపాడడం సిగ్గుచేటన్నారు. అనంతరం హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు ఈశ్వరయ్యను పూలమాలతో సత్కరించారు. ఈ సమావే శంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, ఎస్ఎన్ రసూల్, తదితరులున్నారు.

ఎన్ఆర్ఐ టీడీపీ ద్వారా గల్ఫ్‌లో ఉద్యోగాలు

జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేసిన అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం అయిన ఎన్ఆర్ఐ టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్ ద్వారా మంగళగిరి కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులకు గల్ఫ్‌లో ఉద్యోగాలు లభించాయి. సాధారణ డిప్లొమా, ఐటీఐ అర్హతతోనే ఎలక్ట్రీషియన్ కోర్సులో 45 రోజుల శిక్షణ అనంతరం వీరు ఈ ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె అచ్చెన్నాయుడు ఉద్యోగాలు లభించిన, శిక్షణ పొందిన ఎనిమిది మంది విద్యార్థులకు నియామక, శిక్షణపత్రాలు అందజేశారు. మరో 10 మంది విద్యార్థులు కూడా టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్ లోనే శిక్షణ పొందిన అనంతరం మంగళగిరిలోని జే వన్-సి అనే సర్వీసు సెంటర్ లో ఉద్యోగాలు పొందారు. వారు కూడా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విద్యార్థులను అభినందించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది ఉద్యోగాలు పొందటం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఉచితంగా శిక్షణ పొందే అవ కాశం కల్పించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఎన్ఆర్ఐ టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ వేమూరు రవికుమార్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపవర్మెంట్ సెంటర్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ పెంద్యాల యామిని, ట్రైనర్లు ఉమామహేశ్వరి, అడ్మినిస్ట్రేషన్ విభాగంకు చెందిన డీవీ రావు, హిమజ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మేజర్ పోర్టులలో వివిధ రకాల నిర్వహణ, సూచీలలో అసాధారణ పనితీరు కనబరిచినందుకుగాను సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారం ఈ ఏడాది విశాఖపట్నం పోర్టు అథారిటీకి దక్కింది. న్యూఢిల్లీలో జరిగిన హరిత్ సాగర్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖమంత్రి శర్బానంద్ సోనోవాల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని విశాఖపట్నం పోర్టు చైర్మన్ డా.మధేయాన్ అంగముత్తు అందుకున్నారు. జీరో కార్బన్ ఎమిషన్ గోల్ సాధించేందుకు పాటించాల్సిన మార్గదర్శకాలను కేంద్రమంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. ప్రకృతితో మమేకమై పని చేసేందుకు పోర్టు అభివృద్ధిలో పర్యావరణ సమతుల్యత, కార్యనిర్వహణ వంటి అంశాలు హరితసాగర్ ప్రాజెక్టు మార్గదర్శకాలలో ఉన్నాయని కేంద్రమంత్రి చెప్పారు. పోర్టు నిర్వహణలో క్లీన్ లేదా గ్రీన్ ఎనర్జీ వినియోగం, పర్యావరణ సహిత ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ లేక ఎథనాల్ వినియోగం ఆవశ్యకతను హరితసాగర్ ఉద్ఘాటిస్తోందన్నారు. నిర్ణీత గడువులోగా కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన పంచామృత్ కార్యక్రమంలో ఇది ఒక భాగమన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు సహాయ మంత్రి శ్రీపాద వై నాయక్, షిప్పింగ్ శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్, ఐఏఎస్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి 17 వరకు మహాయజ్ఞం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ప్రజల సౌభాగ్యం, రాష్ట్ర సస్యశ్యామలంగా అభివృద్ధి చెందటం కోసం, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య ప్రాప్తి కోసం, లోక కల్యాణార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ, ధర్మదాయ శాఖ అధ్వర్యంలో మహా యజ్ఞం నిర్వహిస్తున్నారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం) నుంచి 17 (బుధవారం) వరకు 6 రోజుల పాటు మహా యజ్ఞం జరుగుతుంది. తొలిరోజు ఉదయం 5 గం.లకు మహామంగళవాయిద్య హృద్య నాదంతో కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఉదయం 8.30 గంటలకు యజ్ఞ సంకల్పం తీసుకున్న అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభమవుతుంది. రాష్ట్ర సంక్షేమం కోసం 6 రోజుల పాటు యజ్ఞధారణను స్వీకరించనున్న ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాధని కుమారి దంపతులు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతు పెరుగుతోంది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో రెజ్లర్ల పోరాట సంఘీభావ కమిటీ అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మహిళలపై అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు. మహిళలు బహిరంగంగా రోడ్డుపైకి వచ్చి లైంగిక ఆరోపణలు చేసినప్పటికీ తాను తప్పు చేయలేదని, మోదీ, అమిత్ షా ఆదేశిస్తే రాజీనామా చేస్తానని బ్రిజ్‌భూషణ్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీకి బీజేపీ పెద్దల అండ దండలు ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను ఎంపీ పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమన్వయకర్త, మహిళా నాయకురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ ఐదు నెలలుగా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా మోదీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మోదీ పదేపదే చెబుతున్న బేటీ పడావో - బేటీ బచావో నినాదం ఏమైందని ప్రశ్నించారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మోదీని విమర్శించారని వెంటనే కేసు నమోదు చేసి...ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారని, రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కబడ్డీ క్రీడాకారిణి పద్మజ మాట్లాడుతూ క్రీడాకారిణిగా ఆమె ఎదుర్కొన్న అనుభవాలు వివరించారు. రెజ్లర్లపైనే కాదని, క్రీడారంగంలో మహిళలపై అనేక రకాల వేధింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఒలింపిక్ సంఘం ఏపీ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ బాధ్యులు గోళ్ల నారాయణరావు మాట్లాడారు. క్రీడాకారులపై లైంగికవేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి తీర్మానం ప్రవేశపెట్టారు. ఎంబీవీకే బాధ్యురాలు పి.విజయ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. సమావేశంలో టి.అశోక్, పరుచూరి అజయ్, ఎంబీవీకే కార్యదర్శి మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు జగతి, ఐద్వా నాయకులు శ్రీదేవి, పీఓడబ్ల్యూ నాయకులు పద్మ, చైతన్య మహిళాసంఘం నాయకులు రాధ, డాక్టర్ ఝాన్సీ, డీవైఎఫ్ఐ నాయకులు వై.రాము, ఏఐవైఎఫ్ నాయకులు ఎల్.గోవిందరాజు పాల్గొన్నారు.

ఉదయ్ కుమార్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దు

విశాలాంధ్ర-హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన డైరీని సీబీఐ అధికారులు న్యాయస్థానానికి సమర్పించారు. ఈ సందర్భంగా కేసులో ఏ6గా ఉన్న గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఉభయులు వాదనలు వినిపించారు. హత్య కేసులో ఉదయ్ కుమార్‌రెడ్డికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ తెలిపింది. హత్య కేసులో ఉదయ్ కుమార్‌రెడ్డి ప్రమేయంపై ఆధారాలు సేకరించాకే అరెస్టు చేశామని కోర్టుకు వివరించింది. ఈ మేరకు సీబీఐ కౌంటర్ దాఖలు చేస్తూ బెయిల్ ఇవ్వొద్దని కోరింది. వాదనలు విన్న న్యాయస్థానం.. బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులను ఈ నెల 15కు వాయిదా వేసింది. మరోవైపు వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాల ధ్వంసంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉందని కౌంటర్‌లో సీబీఐ పునరుద్ఘాటించింది.

గ్రామశాఖలు పార్టీకి పునాది

స్థానిక సమస్యలపై పోరాడాలి: హరినాథరెడ్డి

మాట్లాడుతున్న హరినాథరెడ్డి. వేదికపై రామానాయుడు, మురళి , జయలక్ష్మి తదితరులు

విశాలాంధ్ర-తిరుపతి: భారత కమ్యూనిస్టు పార్టీకి గ్రామశాఖ గుండెకాయ వంటిదని, దానిని పటిష్ఠవంతం చేయడానికి ప్రతి శాఖ కార్యదర్శి బాధ్యతాయుతంగా పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైరాగి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శాఖాకార్యదర్శుల జిల్లాస్థాయి వర్క్‌షాప్ విశ్వనాథ్ అధ్యక్షతన గురువారం జరిగింది. హరినాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సమిష్టి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నాయని, ఈ తరుణంలో కమ్యూనిస్టు పార్టీగా మన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వహించాలని కోరారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ యువగళం, రాష్ట్రానికి ఇదేం ఖర్మ పేరుతో జగన్ ప్రభుత్వ అసమర్థతను, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళుతోందని, అధికార పార్టీ సైతం గడపగడపకు వైఎస్సార్, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల చేపడుతోందని చెప్పారు. సీపీఐగా మనం కూడా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లోపాలు, రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురాలేకపోవడం, నిరుద్యోగ సమస్య తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఎన్నికల సమయంలోనే పాలకులు సామాన్యుల గురించి మాట్లాడతారని, అధికారం చేపట్టిన తర్వాత పట్టించుకునే నాథుడే ఉండడని తెలిపారు. పుట్టుకలోనే సీపీఐ అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నదని, కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు అందులో భాగమేనని గుర్తుచేశారు. అయినా మొదటి సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతంగా పోరాడిందని, ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని చెండాడిందని తెలిపారు. నేరస్తులతో నిండిన బీజేపీ...రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడం, ఈడీ, సీబీఐతో బెదిరిస్తోందని విమర్శించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరినాథరెడ్డి విమర్శించారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఒక్క పరిశ్రమను తీసుకురాలేదని, ప్రత్యర్థులపై దాడులకు చేయడం నిత్యకృత్యమైందని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో ప్రతి శాఖలోనూ సమస్యలను గుర్తించి...వాటిపై శాఖ కార్యదర్శులు పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్యవంతం చేయడం కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యమని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ శాఖ సమావేశాలు సక్రమంగా జరగడం లేదన్నారు. మొక్కుబడి సమావేశాల వల్ల ప్రయోజనం ఉండదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ఈ వర్క్‌షాపు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. వర్క్‌షాప్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.జయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సీహెచ్ ప్రభాకర్, కె.రాధాకృష్ణ, కె.కుమార్‌రెడ్డి, జనుమాల గురవయ్య, సుధాకర్ రెడ్డి, పి.బాలకృష్ణ, బి.నదియా తదితరులు పాల్గొన్నారు.

అప్పులపై దుష్ప్రచారం తగదు

- టీడీపీ ప్రభుత్వం చేసినఅప్పులే ఎక్కువ
- ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విపక్షం దుష్ప్రచారం చేస్తోందని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ విమర్శించారు. గురువారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రుణాలు.. నాడు-నేడు ఎలా ఉన్నాయో వివరించారు. విభజన తర్వాత 58 శాతం వాటా ప్రకారం లెక్కిస్తే ఆంధ్రప్రదేశ్‌కు మిగిలిన అప్పు రూ.1,18,050 కోట్లు. అదే 5 ఏళ్లలో 2019 మార్చి 31 నాటికి రూ.2.64 లక్షల కోట్లకు చేరుకుంది. ఆ తర్వాత రెండు నెలల్లో ద్రవ్యలోటు రూ.7346 కోట్లు. దాన్ని కూడా కలుపుకుంటే 2019, మే లో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర రుణం మొత్తం రూ.2,71,797.56 కోట్లు ఉండగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రుణం మొత్తం రూ.4,42,442 కోట్లకు చేరిందని, ఇది ఆర్బీఐ నివేదికలో స్పష్టంగా ఉందని వివరించారు. ఇక ప్రభుత్వ పూచీకత్తుతో, ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు చూస్తే..2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న ఆ రుణాలు రూ.14,028.23 కోట్లు కాగా, ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి, అంటే 2019, మే నాటికి ఆ రుణాలు రూ.59,257.31 కోట్లకు పెరిగాయి. ఆ తర్వాత నాలుగేళ్లలో ఆ రుణాల మొత్తం రూ.1,44,875 కోట్లుకి చేరింది. ఇందులో దాదాపు రూ.45 వేల కోట్లు విద్యుత్ రంగానికి చెందినవే. ఆ సంస్థలే ఆ రుణాలు తిరిగి చెల్లిస్తాయి. అందుకే ఆ రుణాలన్నీ ప్రభుత్వానివి అని చెప్పడానికి లేదన్నారు. 2014 నాటికి ప్రభుత్వానికి ఉన్న అప్పులు, ప్రభుత్వ పూచీకత్తుతో ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు.. రెండూ కలిపి రుణభారం రూ.1.32 లక్షల కోట్లు కాగా.. 2019లో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆ రుణాలు రూ.3.31 లక్షల కోట్లకు పెరిగాయి. ఆ తర్వాత నాలుగేళ్లలో రాష్ట్ర రుణభారం రూ.5.87 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. మొత్తం మీద ప్రభుత్వ పూచీకత్తుతో ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు, ఆ పూచీకత్తు లేకుండా చేసిన అప్పులు.. అన్నీ కలిపి చూస్తే.. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న మొత్తం రుణాలు రూ.1,53,346.80 కోట్లు కాగా, ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి, ఆ రుణాలు ఏకంగా రూ.4,12,288 కోట్లకు పెరిగాయి. ఇక ఈ నాలుగేళ్లలో అంటే ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్ర రుణ మొత్తం రూ.6,51,789 కోట్లకు చేరిందని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉండగా అప్పు 10లక్షల కోట్లకు చేరిందని దుష్ప్రచారం చేయడం తగదన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
'e' Procurement Tender Notice No:
06/2023-24/CE/SE(P-II)EE(PD-I)/DB/GVMC Dt: 09.05-2023
Number of works-02, Value of works: Rs.5483.00 Lakhs
Tender Opening Dt. 10.05.2023, Closing Date. 25.05.2023
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE (PD-I) Cell No.9848308824
Note: For any other details requird in respect of above Tender Notice, please contact E.E (PD-1) @ www.apeprocurement.gov.in website.
For Commissioner, GVMC

సంపాదకీయం

తప్పుదిద్దని సుప్రీం తీర్పు

సద్బుద్ధిగల వారికంటే దుర్బుద్ధి గల వారికే ఎక్కువ తెలివి తేటలు ఉంటాయి కాబోలు. దాదాపు పది పదకొండు నెలలుగా మహారాష్ట్రలో రెండు శివసేన వర్గాల మధ్య కలహంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చూస్తే ఇదే అభిప్రాయం కలుగుతోంది. ప్రస్తుత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే అప్పటి ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు చేసి బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి అయిపోయారు. షిండే తిరుగుబాటు చేసిన తరవాత అప్పటి ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే విశ్వాస పరీక్ష ఎదుర్కోకుండా రాజీనామా చేశారు. దానితో షిండే తనకు బీజేపీ మద్దతు ఉందని వాదించి ముఖ్యమంత్రి అయిపోయారు. షిండే తిరుగుబాటు చేసిన తరవాత శివసేన నాయకుడు ఉద్ధవ్ వర్గం అనేకమంది షిండే మద్దతుదార్లను శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించింది. అనర్హత విషయం ఇంకా తేలలేదు కానీ ఉద్ధవ్ ఠాక్రేను విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని కోరడం, షిండే వర్గం ఉద్ధవ్ ఠాక్రేకు మద్దతు ఉపసం హరించకముందే అప్పటి గవర్నర్ భగత్ సింగ్ కోషియారీ విశ్వాస పరీక్షకు ఆదేశించడం, ఉద్ధవ్ రాజీనామా చేసిన తరవాత షిండే చేత ప్రమాణం చేయించడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, న్యాయమూర్తులు ఎం.ఆర్.షా, కృష్ణ మురారి, హిమా కోహ్లి, పి.ఎస్. నరసిం హ తో కూడిన అయిదుగురు సభ్యులుగల రాజ్యాంగ ధర్మాసనం విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని ఉద్ధవ్ ఠాక్రేను ఆదేశించడం చట్ట విరుద్ధం అని ప్రకటించింది. కానీ ఈ తీర్పు వల్ల ఉద్ధవ్ ఠాక్రేకు, ఆయన నాయకత్వంలోని శివసేన వర్గానికి ఒరిగేది ఏమీ లేదు. ఎందుకంటే ఆయనే స్వయంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినందువల్ల ఆయనను మళ్లీ ఆ స్థానంలో ప్రతిష్ఠించే అవకాశం సుప్రీంకోర్టుకు లేదు. సుప్రీంకోర్టు తీర్పు భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలలో గవర్నర్లకు మార్గదర్శకంగా ఉండొచ్చు కానీ పార్టీలు ఫిరాయించి అధికారం సంపాదించే వారిని కట్టడి చేయడానికి ఎంతమాత్రం ఉపకరించదు. అయితే ఈ తీర్పు కారణంగా ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే శాసనసభ్యుడిగా అనర్హుడు కావడానికి ఇంకా అవకాశం మిగిలే ఉంది. ఈ కేసు తెమలడానికే పది పదకొండు నెలలు పట్టినప్పుడు అనర్హత వ్యవహారం తేలే సరికి 2024లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు సమయం ఆసన్నమవుతుంది. 141 పేజీల సుదీర్ఘమైన తీర్పులో సుప్రీంకోర్టు ప్రధానంగా గవర్నర్ పాత్రను అభిశంసించింది. ఆ తరవాత స్పీకర్ పాత్ర, పార్టీ ఫిరాయింపుల మీద కొన్ని వ్యాఖ్యలు చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా షిండే వర్గాన్ని ఇరుకున పెట్టగల అనేక ప్రశ్నలు సంధించింది. కానీ అది ఆయనను అక్రమంగా చేపట్టిన ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడానికి తోడ్పడలేదు. సుప్రీంకోర్టు ఈ కేసులో అసలు సమస్యకు నికరమైన పరిష్కారం చూపించి ఉండకపోవచ్చు. కానీ గవర్నర్ వ్యవహార సరళిపై తీర్పులో చెప్పిన మాటలు గవర్నర్లు తమ నడవడికను మార్చుకోవడానికి ఉపయోగపడతాయి. అయితే ప్రస్తుత వాతావరణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షానికి వత్తాసు పలికే వారినే గవర్నర్లుగా నియమిస్తున్నందువల్ల అత్యున్నత న్యాయస్థానం హితబోధలను వినిపించుకునే వారిని కాగడా పెట్టి వెతకాల్సిందే. రాజకీయ వ్యవహారాలలో గవర్నర్ జోక్యం చేసుకోకూడదని సుప్రీంకోర్టు అనుమానాలకు తావివ్వకుండా చెప్పింది. ఒక రాజకీయ పార్టీలో ఉన్న అసమ్మతిని, అనంగీకారాన్ని ఆ పార్టీ నిబంధనావళి ప్రకారమే పరిష్కరించుకోవాలని కూడా సుప్రీంకోర్టు భావించింది. ఒక రాజకీయ పక్షం ప్రభుత్వాన్ని సమర్థించకపోవడానికి, లేదా ఆ పార్టీలోని కొందరు వ్యక్తులు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకపోవడానికి తేడా ఉంటుంది.

రాజకీయ పార్టీలలో ఉన్న అసమ్మతి, అభిప్రాయ భేదాల ఆధారంగా గవర్నర్ విశ్వాస పరీక్షకు ఆదేశించడం కుదరదని కూడా రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది. గవర్నర్ ఒక రాష్ట్రానికి అలంకారప్రాయమైన అధిపతే అన్న విషయాన్ని సుప్రీంకోర్టు మరో సారి గుర్తుకు చేసింది. అందువల్ల తన అధికార పరిధి ఏమిటో గ్రహించాలని కూడా హితవు చెప్పింది. వివిధ పార్టీల మధ్య, లేదా ఒక పార్టీలో విభేదాలతో గవర్నరుకు నిమిత్తం లేదని కూడా న్యాయమూర్తులు తెలియజేశారు. అందుకే ఉద్ధవ్ ఠాక్రే మెజారిటీ కోల్పోయారని గవర్నర్ నిర్ధారణకు రావడం తప్పని తేల్చింది. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా వికాస్ అఘాడీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు తాము ఆ కూటమిలో ఉండబోమని చెప్పడం కూడా వారు ప్రభుత్వానికి మద్దతు ఉపసం హరించినట్టు కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అసలు అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు ఎవరూ ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నామని అధికారికంగా తెలియజేయనే లేదు. షిండే తిరుగుబాటు ప్రకటించిన నేపథ్యంలో కొంతమంది ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా నిలవడంతో ఉద్ధవ్ రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగిన మద్దతు తనకు ఉందని షిండే చెప్పడంవల్ల గవర్నర్ ఆయనను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. ఇది మాత్రం సవ్యమైన చర్యగానే సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నారు.

షిండే ప్రభుత్వం ఏర్పాటు చేయడం చట్టబద్ధం కాదన్నది సుప్రీంకోర్టు అంతరార్థం అయినప్పటికీ ఉద్ధవ్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారు కనక ఇప్పుడు ఏక్ నాథ్ షిండేను గద్దె దించే అవకాశం కూడా సుప్రీంకోర్టుకు లేకుండా పోయింది. రాజకీయ పార్టీకి, ఆ పార్టీ శాసనసభా పక్షానికి మధ్య ఉన్న తేడా ఏమిటో కూడా న్యాయస్థానం తెలియజేసింది. శాసనసభలో విప్ ను నియమించే అధికారం రాజకీయ పార్టీదే తప్ప శాసనసభా పక్షానిది కాదన్న వాస్తవాన్ని కూడా అధికారం మోజులో విస్మరించారు. అదే సమయంలో శాసనసభా కార్యకలాపాల్లో అసంబద్ధతను సమీక్షించే అధికారం తమకు ఉందని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టసభ కార్యకలాపాలు రాజ్యాంగ విలువలను కాపాడడంకోసమేనని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ తీర్పువల్ల అంతిమంగా జరిగేది ఏమిటంటే మాయోపాయంతో అధికారంలోకి వచ్చిన షిండే ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. అయితే ఇది సుప్రీంకోర్టు తేల్చిన అంశం ఏమీ కాదు. షిండే అధికారం సంపాదించిన తీరును సుప్రీంకోర్టు సమర్థించలేదు. కానీ విశ్వాస పరీక్ష ఏదుర్కోకుండా ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేసినందువల్ల సుప్రీంకోర్టు చేయగలిగింది ఏమీ లేకుండా పోయింది.

షిండే అధికారంలోకి రావడానికి అప్పటి గవర్నర్ కోషియారీ నిర్ణయాలు ఎంత భీకరమైనవి అయినప్పటికీ, షిండే మంత్రివర్గం సంపూర్ణంగా న్యాయబద్ధమైంది అని సుప్రీంకోర్టు నమ్మక పోయినప్పటికీ షిండే అధికారం చేపట్టకముందు ఉన్న పరిస్థితిని పునరుద్ధరించే అవకాశం సుప్రీంకోర్టుకు లేకుండా పోయింది. రాజకీయ పార్టీలు, అధికార దాహంతో ఉన్న వారు రాజ్యాంగ నియమాలను, ప్రజాస్వామ్య సూత్రాలను ఇంత బాహాటంగా ఉల్లంఘిస్తే అత్యున్నత న్యాయస్థానం జరిగిన పొరపాట్ల దిద్దుబాటుకు అవకాశం లేకుండా పోవడం అసలు విషాదం. ఏమైతేనేం షిండేను వెనక ఉండి ప్రోత్సహించిన బీజేపీ పాచిక పారింది. రేపో మాపో షిండే బీజేపీలో చేరడమే తరవాయి. ఇలాంటిపార్టీలను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యమైన బీజేపీకి మాత్రం అపారమైన సంతోషం మిగులుతుంది.

మంచిబుద్ధే అభివృద్ధికి బాట

రా బావ ఆడవాళ్లకు ఆశలెక్కువ అంటున్నావు. కాకపోతే ఏంటి బావ మీ చెల్లెలు ఆశలు పందెపు గుర్రం స్వారి లాగ పరుగుపెడు తుంటే ఏం చేయాలి చెప్పు. అది సరే ఆడవాళ్లకే ఆశలు ఎక్కువ అని బహిరంగంగా అన్నావనుకో. మహిళా సంఘాలు మీ ఇంటిమీదకు వచ్చిపడతాయి. ఈ రోజు ఏమైంది అసలు మనకున్న ఆర్థికస్తోమతను బట్టి ఆశలుండాలిగానీ జమిందారులకు మల్లే ఆశలుంటే ఎలా చెప్పు. అసలేమైందయ్యా ఈ రోజు విరుచుకుపడుతున్నావు. ఏం లేదు ఉక్క పోతకు నిద్రపట్టడంలేదు. ఏ.సీ కొనాలంటుంది. ఎ.సీ ఉంటే వచ్చే కరెంటు బిల్లు కట్టగలగాలి కదా. అది సరే ఆశలు అవసరాలను బట్టి ఉంటాయి. ఇప్పుడు ప్రజల అవసరాలు పెరుగుతుంటే ప్రభుత్వాలు తీర్చలేక తలపట్టుకుంటున్నాయి. సమాజంలోని ఒకరిని చూచి మరొకరు ఆశలు పెంచుకుని మధ్య తరగతి కుటుంబాలుపడే అవస్థ తెలసిందే. ఆశలనేవి మగవారికి, ఆడవారికి ఇద్దరికి ఉంటాయి. ఇంటిపెద్దగా మగవారైనా, ఆడవారైనా తమకు వచ్చే ఆదాయంతో సమతుల్యత పాటించి బుద్ధితో ఆలోచించి ముఖ్యావసరాలు తీర్చుకోవ దానికి ప్రయత్నించాలి. అసలు మనకు కనబడని మనసు నుండి ఆశలు పుడతాయి. కానీ మనం బుద్ధిబలంతో ఉన్న ఆర్థికస్తోమతను

సరించి మంచి, చెడు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అత్యవ సరాలు ముందుతీర్చుకొని మిగిలిన సొమ్ముతో ఇతర అవసరాలకు కేటాయించాలి.

మనల్ని ఆడించే మనసు మంచి, చెడులు నిర్ణయించే బుద్ధి రెండు మనకు కనబడకపోయినా ఆ రెండే మనల్ని సన్మార్గులు గానో, దుర్మార్గులుగానో మారుస్తాయి. అది సరే ఇంత వివరం ఎంత మందికి తెలుసు. ఆశల్ని బుద్ధిబలంతో విశ్లేషించుకొని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నిజమే బావ మన లాంటి సామాన్యులకే కాదు, మన పాలకులకే తెలియక కొన్ని విషయాలలో ప్రజల సొమ్ము మట్టిపాలు చేస్తున్నారు. మనం ప్రభుత్వం ఏం చేయాలన్నా చేయ గలదని అనుకుంటాం. కానీ ఉద్యోగులు పెన్‌డౌన్ అనగానే భయపడే ప్రభుత్వాలను కూడా మనం చూస్తున్నాం. అలాగే సామాన్యుల సంగతి మాకెందుకు మా జీతాలు పెంచవలసిందే అనే ఉద్యోగుల్ని చూస్తున్నాం. ఏతావాత మన కర్థమయ్యేదేమిటంటే స్వార్థబుద్ధే విజయం సాధిస్తోందని. మంచి చెడులు చేసే సమాజంలో మంచివాడని పిలుచుకున్నా, చెడ్డపనులు చేసి చెడ్డవాడు, దుర్మార్గుడు అనిపించుకున్నా అందుకు కారణం మన నిర్ణయాలే. మామూలుగా చెడ్డపని చేసినవాడిని బుద్ధిలేని వాడనీ, బుద్ధి ఏమైందిరా అంటుంటాం. అందుకని చేసే ప్రతిపనిని మనసు ఆర్డరువేస్తే బుద్ధితో ఆలోచించి నిర్ణయం తీసుకుంటే, ఎటువంటి అనర్థాలు జరగవు. అదుపుతప్పిన మనసును అదుపులో పెట్టుకోవాలంటే బుద్ధితో ఆలోచించాలి. మంచి, చెడులు బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకుంటే అంతా సవ్యంగానే మంచి మార్గంలోనే జరుగుతాయి.

అది సరే ప్రస్తుతం సమాజంలో సన్మార్గులు తగ్గిపోయి దుర్మార్గులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. అందుకు కారణమేంటి బావ. మనం కొందరిని చూచి స్వార్థపరులని, మరి కొందరిని చూచి నిస్వార్థులని అంటాం కదా. స్వార్థంతో ఇతరులకు అన్యాయం చేసేవారిని స్వార్థపరులని, తాము నష్టపోయినా ఇతరుల క్షేమం కోరేవారిని నిస్వార్థులని అంటాం. కాని అలాంటి నిస్వార్థులు ప్రస్తుతం ఉన్నారంటావా. ఎందుకుందరు అందరూ స్వార్థంతో అలోచించరు కద. అందరూ స్వార్థపరులైతే ఒకరిని మరొకరు మోసగించలేరు. నిస్వార్థుల మెతకతనాన్ని ఆసరా చేసుకుని స్వార్థపరులు మోసం చేస్తున్నారు. వేల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి పార్లమెంటులో కూర్చుంటున్నారు. ఆ విషయం పత్రికలలో వచ్చినా, ఏ మాత్రం సిగ్గుపడకుండా పెద్ద మనిషిలా తిరుగుతున్నారు. నిజమే ఎవరు ఏమనుకుంటే నాకేంటి అనుకునేవారు అలాగే తిరుగుతారు. కానీ ప్రజాప్రతినిధులుగ అటువంటి వారు ఉండటం వలన దేశం ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడంలేదు. అందుకే వ్యక్తుల మంచి బుద్ధే దేశాభివృద్ధికి కారణం. చెడు బుద్ధివారి వల్ల ఎటువంటి అభివృద్ధి జరగదు. ప్రజల సొమ్ము చెడుబుద్ధి కల స్వార్థపరుల ఖాతాలో జమ అవుతోంది. ప్రతిమనిషి పక్కవాడిని దోచుకోవాలనే చెడ్డబుద్ధి ఉండటం వలన సన్మార్గులు నష్టపోతున్నారు. కనుక బావ ఇంటి యజమానికి మంచి బుద్ధి ఎంత అవసరమో దేశాన్ని ఏలేవారికి అంతకంటే అవసరం. మంచి బుద్ధే దేశాభివృద్ధికి కారణం కాగలదు.

సెల్: 985569394

బీసీలకు ఒరిగిందేమిటి?

డా. అఖిలమిత్ర

> సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించడం లేదు. కులాల కార్పొరేషన్లు ఏర్పాటుచేయడం ద్వారా ఆయా కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను కింది స్థాయిలో అర్థం చేసుకుని పరిష్కరించే అవకాశం కలుగు తుంది. మిగతా కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా, సంచార జాతుల కార్పొరేషన్ ద్వారా సబ్సిడీరుణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటే ఈ కులాల్లో సమగ్ర అభివృద్ధికి పునాదులు పడతాయి. యాంత్రీకరణతో కార్పొరేట్ ప్రాబల్యం పెరిగిపోతోంది. మరోవైపు కరోనా మహమ్మారి దెబ్బతో కుల వృత్తులు,చేతి వృత్తులు దెబ్బతిన్నాయి. కరోనా కల్లోలంతో దెబ్బతిన్న కుల వృత్తుల కుటుంబాలకు కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి చేయూత అందిస్తా మనే ప్రకటన కూడా రాష్ట్రప్రభుత్వ పెద్దలనుంచి రావడంలేదు.

భారతదేశంలో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబిసి లు) దీర్ఘకాలంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల సమూహం. భారత ప్రభుత్వం ఓబిసిలను ప్రత్యేక వర్గంగా గుర్తిస్తుంది, వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌వంటి ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా, ఓబిసిలు విద్య, రాజకీయాలు, వ్యాపారంలో సహా వివిధ రంగాలలో అణచివేతకు గురయ్యారు. విద్య, వైద్యం ఉపాధి రంగాలలో ప్రభుత్వాల చేయూత లేకపోవడంతో అప్పులపాలై జీవితాలు దుర్భరంగా తయారయ్యాయి. వారిలో డెబ్బై శాతం ఇప్పటికీ పేదరికంలో జీవిస్తున్నారు. స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో లేవు. వివక్ష , హింసకు గురవుతున్నారు. కొన్ని ఓబిసి కమ్యూనిటీలు, సమూహాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వంటి ఇతర వర్గాల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్నందున, నిర్ణయాత్మక విధానాల ప్రయోజనాలు కూడా సంవత్సరాలుగా పలుచనయ్యాయి. ఓబిసిల ఆందోళనలను పరిష్కరించడానికి రిజర్వేషన్‌లపై చర్చలు జరుగుతున్నాయి. కొన్ని ఓబీసీ కమ్యూనిటీలను రిజర్వేషన్ జాబితాలో చేర్చాలని, ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్లు ఉండాలని వాదిస్తున్నారు.

దేశంలో ఓబిసిల వివిధ రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించి నప్పటికీ, అనేక సవాళ్లు మిగిలి ఉన్నాయి. ఎంతో ఆర్భాటంగా ఓబీసీల అభివృద్ధికోసం ఏర్పాటుచేసిన 56 కార్పొరేషన్ల పాలక మండళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించి మూడు సంవత్సరాలవుతుంది. మొత్తం 139 బీసీ కులాలకు గాను ప్రస్తుతం 56 కార్పొరేషన్లు సృష్టించి 728 చైర్మన్, డైరెక్టర్ల పదవులను ఎవరి కులపరిధిలో వారికి ఇచ్చారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించగా చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించామని చెబుతున్నప్పటికీ వాస్తవానికి చాల జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. బడుగుల కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ల ఎంపికలో అగ్ర వర్ణాలు ప్రధాన భూమిక పోషించారు. కులాల పుట్టుక, జీవన శైలి, సామాజిక స్థితిగతుల గురించి ఏమాత్రం తెలియనివారు కార్పొరేషన్ల క్రియాశీలక సభ్యులను ఏర్పాటుచేస్తే ఇలా అఘోరిస్తాయి. అగ్ర వర్ణానికి చెందిన వారిని మాత్రం రాష్ట్రంలో ఉన్న కీలకమైన పదవులను, సంపద లభించే పదవులను ఇచ్చుకోవడంతోపాటు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, హైకోర్టు జిల్లా కోర్టుల జీపీలను, స్కిల్ డెవలప్‌మెంట్, పారిశ్రామిక మౌలికసదుపాయాలు, సమాచార కమిషనర్ల, సలహాదారులుగా నియమించారు. ఆర్థికంగా పటిష్టంగా ఉన్న శాఖలు, ఆదాయ వనరులున్న శాఖల నామినేటెడ్ పదవులు అగ్ర వర్ణానికి 720 పైగా ఇచ్చారు. విద్య, ఆరోగ్యం, ప్రాజెక్టులు, స్కిల్‌డెవెలప్మెంట్, మీడియా, టెంపుల్ కమిటీలు, మార్కెట్ కమిటీలు, విశ్వవిద్యాలయాల పాలకమండలి సభ్యులు, రాయలసీమ, కోస్తా , ఉత్తరాంధ్ర ఇన్‌చార్జులు, స్థానికంగా ఉన్న రేషన్ షాపులు, ఆహార పంపిణీ, వంట ఏజెన్సీ, డిష్, కేబుల్ నెట్, రవాణా ఏజెన్సీ, కస్టమర్ హైరింగ్ సెంటర్లు, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు అది ఇది అని కాదు లాభం వచ్చే అన్ని రంగాల్లో అగ్ర వర్ణం వారు తిష్టవేశారు. బీసీ కులాల అభివృద్ధికి పాటు పడుతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆచరణలో ఈ కులాల అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతులను ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక రంగాల్లో అభివృద్ధి చేయవలసిన రాజ్యాంగ బాధ్యతను ఈ ప్రభుత్వం విస్మరిస్తోంది. సమాజం ఎప్పటికప్పుడు మారుతుంది. ప్రజల్లో కూడా దానికి అనుగుణంగా మార్పులు వస్తున్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. అన్ని రంగాల్లో యాంత్రీకరణ పెరుగుతోంది. ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి.

ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాలకూ విస్తరిస్తోంది. ఈ పరిణామ క్రమంలో కులవృత్తులు, చేతివృత్తులు తమ అస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. ఇంతవరకు ఈ వృత్తులపైనే ఆధారపడిన కులాలు, వర్గాలకు యాంత్రీకరణ, కార్పొరేటీకరణ దక్కాలి. కానీ ప్రస్తుతం వ్యవస్థలో అలా జరగడం లేదు. స్టీల్, ఐరన్ పరిశ్రమలతో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి కులాలు తమ వృత్తులను కోల్పోయాయి. ప్లాస్టిక్ పరిశ్రమ కారణంగా మేదరి, కుమ్మరివృత్తులు మరుగున పడ్డాయి. జేసీబీలు, హిటాచీ మెషిన్లతో వడ్డెర్ల బతుకులు ఆగమై కూలీలుగా మారారు. ట్రాక్టర్లు, మిల్లులు రావడంతో వడ్రంగి, కమ్మరి పని దెబ్బతింది. డ్రై క్లీనింగ్ షాపులువల్ల చాకలి, నేతమిల్లులు రావడంతో నేత వృత్తి, బ్యూటీపార్లర్లు, హేర్ కటింగ్ సెలూన్ల రాకతో నాయిబ్రాహ్మలు , రెడీమేడ్ దుస్తులతో దర్జీలు, జ్యూయెలరీ షాపులతో విశ్వ బ్రాహ్మణుల వృత్తులు దెబ్బతిన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతి దరఖాస్తుదారునికి సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించారు. మరోవైపు నాలుగేళ్లుగా కొత్త రుణాల కోసం నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి లక్షల మంది ఎదురు చూస్తున్నారు. బీసీ కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కులాల సమస్యలపై అవగాహన ఉన్న వారు తమకు కావలిసినపథకాలను డిజైన్ చేయ గలరు, కానీ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ల నియామకం అస్తవ్యస్తంగా తమ చెప్పుచేతల్లో ఉన్న వారికి ఇచ్చారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించడం లేదు. కులాల కార్పొరేషన్లు ఏర్పాటుచేయడం ద్వారా ఆయా కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను కింది స్థాయిలో అర్థం చేసుకుని పరిష్కరించే అవకాశం కలుగు తుంది. మిగతా కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా, సంచార జాతుల కార్పొరేషన్ ద్వారా సబ్సిడీరుణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటే ఈ కులాల్లో సమగ్ర అభివృద్ధికి పునాదులు పడతాయి. యాంత్రీకరణతో కార్పొరేట్ ప్రాబల్యం పెరిగిపోతోంది. మరోవైపు కరోనా మహమ్మారి దెబ్బతో కుల వృత్తులు,చేతి వృత్తులు దెబ్బతిన్నాయి. కరోనా కల్లోలంతో దెబ్బతిన్న కుల వృత్తుల కుటుంబాలకు కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి చేయూత అందిస్తా మనే ప్రకటన కూడా రాష్ట్రప్రభుత్వ పెద్దలనుంచి రావడంలేదు. కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వకపోగా..బీసీలకు రూ.లక్ష- రూ. 2 లక్షల రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదు. కానీ, బడా కంపెనీలకు, పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రుణాలు ఇస్తున్నారు. వారు వాటిని కట్టకపోతే మాఫీ చేస్తున్నారు. పేదలకు రుణాలు ఇవ్వడానికి మాత్రం ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా బ్యాంకులు తమ వైఖరి మార్చుకుని బీసీలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలి. అందుకు బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి ప్రతి దరఖాస్తుదారుకు బ్యాంకు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

నర్సుల సేవలు విలువైనవి

ఐ-మెయిల్

ప్రజల ఆరోగ్యసంరక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలను అందిస్తారు. మనకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రికి వెళ్ళినపుడు డాక్టర్ కన్నా ముందు వచ్చి మనకు సహాయం చేసేది నర్సులే. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చాక మనల్ని కంటికి రెప్పలా కాపాడి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అయ్యే వరకు సేవలు చేసే నిస్వార్థ సేవకులు కూడా నర్సులే. కోవిడ్ -19 మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర, అందించిన సేవలు మన అందరికి తెలిసిన విషయమే. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు మే 12 సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం 1965 నుండి జరుపుతున్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన సేవలను గుర్తు చేసుకుంటారు. నర్సింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా విశేష సేవలందించిన నర్సులకు భారతదేశ రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందిస్తారు. ఈ అవార్డులో భాగంగా కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత, స్వచ్ఛంద సంస్థల్లో విశిష్ట సేవలందించిన నర్సులకు ఒక పతకం, ప్రశంసా పత్రము, జ్ఞాపికతోపాటు 50వేల రూపాయిల నగదు బహుమతిని బహు కరిస్తారు. నర్సుల సేవలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసిస్తూ, నర్సింగ్ శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడం ద్వారా, దేశాలు వారి దేశ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, లింగ సమానత్వాన్ని ప్రోత్స హించడం, ఆర్థికవృద్ధికి మద్దతు వంటి మూడు ప్రభావాలను దేశాలు సాధించవచ్చని పేర్కొన్నది. ప్రపంచంలోని మొత్తం ఆరోగ్య కార్యకర్త లలో సగానికి పైగా నర్సులు ఉన్నారు, అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా నర్సుల కొరత ఉంది, ఇంకా దాదాపు ఆరు మిలియన్ల మంది నర్సులు అవసరం ఉంది.

బొల్లం బాలకృష్ణ, 9989735216

పాకిస్థాన్ కాదు కల్లోలిస్థాన్

టి.వి.సుబ్బయ్య

దేశ విభజన జరగడంతో పాకిస్థాన్ అవతరించింది. అది మత పరమైన విభజన. దేశ విభజన సమయంలో కనివిని ఎరగని సామాజిక సంక్షోభం, హత్యాకాండ జరిగింది. లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. అన్నిటి కంటె ముఖ్యంగా హిందువులు, ముస్లింల మధ్య ద్వేషం, పగ ప్రతీకారం ప్రజల్లో జీర్ణించుకుపోయాయి. ముఖ్యంగా కశ్మీరు సమస్య రగులుతూనే ఉంది. పాకిస్థాన్‌లో సైనిక ఆధిపత్యం, మతాధిపత్య రాజ్యం కావడంతో ఏనాడు ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడి పటిష్ఠం కాలేదు. మతాధిపత్యం, సైనిక పెత్తనం కొనసాగుతున్న అనేక దేశాల్లో కల్లోల పరిస్థితులే నెలకొని ఉన్నాయి. ఇప్పుడు ఆ దేశంలో అనేక సంక్షోభాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. దేశ మాజీ ప్రధాని, క్రికెట్ మాజీ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్‌ను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేయడంతో ఒక్కసారిగా అనేక జిల్లాల్లో గృహ దహనాలు, లూటీలు విచ్చలవిడిగా సాగాయి. సైన్యం రంగంలోకి దిగింది. ఈలోపు బుధవారం మరో అవినీతి ఆరోపణపై ఇమ్రాన్‌ఖాన్‌కు కోర్టు 8 రోజుల రిమాండ్ విధించి యాంటీ కరప్షన్ వాచ్‌డాగ్‌కు అప్పగించింది. ముఖ్యంగా పంజాబ్, ఖైబర్ ఫతుంఖ్వా జిల్లాల్లో అల్లర్లు, ఘర్షణలు జరిగాయి. అలాగే లండన్ తదితర చోట్ల కూడా ఇమ్రాన్‌ఖాన్ అభిమానులు నిరసన ప్రదర్శనలు చేశారు. ప్రధాన మంత్రి షహబాజా షరీఫ్ ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారని వార్తలు వచ్చాయి. ప్రధానిగా ఉన్నప్పుడు వచ్చిన బహుమతులను 2018-2022 కాలంలో అక్రమంగా ఇమ్రాన్‌ఖాన్ అమ్ముకున్నారన్న అభియోగాలను ఎన్నికల కమిషన్ ధృవీకరించింది. నిధుల దుర్వినియోగం కేసుతో పాటు బహుమతుల విక్రయ కేసు ఇమ్రాన్‌ఖాన్ మెడకు చుట్టు కున్నది. అల్లర్లలో చాలామంది చనిపోయారు. ఇమ్రాన్‌పై కొన్ని డజన్ల కేసులు నమోదై ఉన్నాయి. కొన్నికేసులు విచారణలో ఉన్నాయి. ప్రధానంగా సైన్యంతో విరోధం పెంచుకొని తలపడుతున్నాడు.

సైన్యం సహాయంతో ఇమ్రాన్ అధికారంలోకి వచ్చారు, సైనిక జనరల్ అసీమ్ మునీర్ సైతం ఇమ్రాన్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నాడని తెలుస్తోంది. పాకిస్థాన్ స్వాతంత్ర్యదేశంగా అవతరించి 75ఏళ్లు అయింది. అయి నప్పటికీ కశ్మీరు సమస్య పరిష్కారం కాకుండా పాకిస్థాన్ సైన్యం అడ్డుపడు తోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం కశ్మీర్ సమస్య కొనసాగడానికి ప్రధాన కారణాలు ఇటీవల గోవాలో జరిగిన షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొన్న పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సైతం ఉగ్రవాదాన్ని సమర్థిస్తున్నట్టే మాట్లాడారు. ఆరేడు దశాబ్దాల కాలంలో ఏనాడు ఎరుగని ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అవినీతి విజృంభించింది. అన్నిరకాల వస్తువులు, పెట్రోలు, డీజిల్‌ధరలు అమాంతం పెరిగి అత్యధిక ప్రజలు విలవిలలాడుతున్నారు. విదేశీ మారక ద్రవ్యం

నిల్వలు దాదాపు అడుగంటిపోయాయి. ఒక నెలకు సరిపడ దిగుమతులకు మాత్రమే నిల్వలు న్నాయని వార్తలు. ఐఎంఎఫ్ ఇస్తానన్న రుణం కూడా ఇంతవరకు అందలేదు. మత మైనారిటీలుగా ఉన్న హిందువులపై విద్వేష దాడులు, ఆలయాలను ధ్వంసం చేయడం మత విద్వేషాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. భారతదేశంపై ద్వేషాన్ని వెళ్లగక్కడం చాలాకాలంగా ఉంది. వామపక్షాలను తీవ్రంగా అణచివేశారు. మత రాజ్యం కావడం, ఇతర మతాలపై ద్వేషం పెంచుకోవడం, సైనిక పెత్తనం ఎక్కడ ఉన్నా నిరంతరం ఘర్షణలు జరగడం పరిపాటి అవుతుంది. క్రమంగా నియంతృత్వం బలపడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడి పోతాయి. ఇలాంటి దేశాలు ఇజ్రాయిల్, మైన్మార్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ ప్రముఖంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్యం, బహుళత్వం, వ్యక్తిగత హక్కులు గత కాలపు చరిత్రను విస్మరించి మతపరమైన విషయాలను ప్రచారం చేస్తూ మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారు. తిరోగమనచరిత్రను పదిల పరిచేందుకు పాలకులు పూనుకుంటారు. ఇలాంటిదేశాల్లో నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోవడం సర్వసాధారణం. అంతేకాదు రాజ్యాంగాన్ని, ఇతర అన్ని వ్యవస్థలను ధ్వంసం చేయడం తప్పనిసరిగా ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసేందుకు వెనుకాడటం లేదు. సినిమాలు నిర్మించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మీడియాను లొంగదీసుకొని పాలకులకు అనుకూలంగా ప్రచారం చేయించుకోవడం నిత్య కృత్యమవు తుంది. మెజారిటీ మతం ఆధారంగా ప్రభుత్వంలోకి వచ్చి మధ్యయుగాల నాటి చీకట్లలోకి నెట్టి నియంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి యత్నించడం చూస్తున్నాము.

పాకిస్థాన్ 75 ఏళ్ల అనుభవాన్నిచూసిన తర్వాత కూడా ఏ ప్రజాస్వామ్య దేశమైనా జాగ్రత్త పడుతుంది. భారతదేశం ఏలుతున్న మత, మితవాద, అతిజాతీయవాద నయా దేశభక్తులు దేశాన్ని మధ్యయుగాలలోకి తోసి వేయాలని వ్యూహంపన్నడం అత్యంత విచారకం. దాదాపు గత తొమ్మిదేళ్లుగా నయా దేశభక్తులు దేశంలోని అన్ని వ్యవస్థలను తమ గుప్పిట పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను భ్రష్టు పట్టించారు. అవినీతి విచ్చల విడిగా వికటాట్టహాసం చేస్తోంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తూ నిరుద్యోగం, పేదరికాన్ని పెంచారు. రాజ్యాంగ విచ్ఛిన్నం, స్వాతంత్ర్యపోరాట లక్ష్యాలను తుంగలోతొక్కడం, అనేక రకాలుగా మైనారిటీ మతస్థులను వేధించడం నిత్యకృత్యమైంది. పేదలు, ధనికుల మధ్య ఆర్థిక అసమానతలు గతంలో ఏనాడు లేనంతగా పెరిగిపోవడం చూస్తున్నాము. న్యాయ వ్యవస్థను సైతం అదుపు చేయాలని చూస్తున్నారు. ప్రజల కష్టంతో నిర్మించిన ప్రాజెక్టులను, అభివృద్ధి పరిచిన పరిశ్రమలను విస్మరించి గత పాలకులను తిట్టడంతో సరిపోయింది. వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్ ధరలను పెంచేసి సామాన్య ప్రజల జీవనాన్ని అష్టకష్టాల పాలుచేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచి నియంతృత్వం వైపు త్వరత్వరగా అడుగులు వేస్తున్నారు. పార్లమెంట్‌లో సమగ్రమైన చర్చలు లేకుండానే ధనికుల అనుకూల పేదల వ్యతిరేకమైన చట్టాలు చేస్తున్నారు. ఎన్నికల సంఘాన్ని, దర్యాప్తు సంస్థలను అదుపులో పెట్టుకొని పాలకులు తమ లక్ష్యాలను నెరవేర్చుకుంటున్నారు. విద్వేష ప్రచారాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అంతర్ సంఘర్షణలకు దారితీసే పరిస్థితు లను కల్పించి, సర్వ వ్యవస్థలను స్వాధీనం చేసుకుని సమాజాన్ని తిరో గమనం పట్టించే పంథాను అనుసరిస్తున్నారు. వీటిని గుర్తించి ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు అప్రమత్తం కావాలి.

మాజీ సీజేఐ గొగోయ్‌పై రూ.కోటికి పరువునష్టం కేసు

గువహటి: రాజ్యసభ ఎంపీ, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్‌పై, ఆయన ఆత్మకథ ప్రచురణాలయం రూపా పబ్లికేషన్స్‌పై పరువునష్టం కేసు నమోదైంది. గొగోయ్ ఆత్మకథ 'జస్టిస్ ఫర్ ఏ జడ్జి'లో తనను అవమానించినందుకు రూ.కోటి డిమాండ్ చేస్తూ అసోం పబ్లిక్ వర్క్స్ (ఏపీడబ్ల్యూ) అధ్యక్షుడు అభిజీత్‌శర్మ... కామరూప్ మెట్రోస్ జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ పుస్తకం ప్రచురణ-విక్రయాల నిలుపుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిని విచారించిన న్యాయస్థానం స్పందిస్తూ పిటిషన్, పత్రాలను పరిశీలించిన తర్వాత చట్టం, వాస్తవాల దృష్ట్యా కొన్ని ప్రధాన ప్రశ్నలు తలెత్తాయి. వేరొక పక్షాన్ని వినకుండా ఉత్తర్వులు ఇవ్వడం కుదరదు' అని పేర్కొంది. వాదులు, ప్రతివాదులు ఇద్దరికీ సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 3వ తేదీకి వాయిదా వేసింది.

వైద్యుల రక్షణకు కొత్త చట్టం

కేరళ ప్రభుత్వం నిర్ణయం

తిరువనంతపురం: మద్యం మత్తులో వైద్యురాలిని దారుణంగా చంపిన ఘటనపై కేరళలో వైద్యులు ఆందోళనను తీవ్రతరం చేశారు. తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు ఆందోళనకు దిగారు. కాగా, డాక్టర్ల భద్రతపై చర్చించడానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ల ఆందోళన, మహిళా డాక్టర్ హత్యపై విజయన్ చర్చించారు. డాక్టర్ హత్య తర్వాత వైద్యులు ఎవరూ విధులకు హాజరుకాలేదు. ఆసుపత్రుల రక్షణ కోసం కొత్త చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తున్న డాక్టర్లపై దాడుల నియంత్రణకు కొత్త చట్టం తీసుకురావడంపై సీఎం చర్చించినట్లు సీఎంఓ ఓ ప్రకటనలో తెలిపింది. అత్యవసర సమావేశానికి ఆరోగ్యశాఖమంత్రి వీణా జార్జి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీపీ జాయ్, ఆరోగ్యం, శాంతిభద్రతలు, వైద్య విద్యశాఖ కార్యదర్శులు, డీజీపీ, ఏడీజీపీలు, వివిధ శాఖల అధిపతులు హాజరయ్యారు. డాక్టర్ల సంఘాల ప్రతినిధులతో విజయన్ ఉదయం చర్చించిన తర్వాత అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సీఎంఓ తెలిపింది. విజయన్‌తో సమావేశం తర్వాత డాక్టర్లు మీడియాతో మాట్లాడుతూ తమ సమస్యలను సీఎం ఆలకించారని, తమ డిమాండ్లను సానుభూతితో విని...పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆసుపత్రుల రక్షణకు సత్వరమే కొత్త చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, ఆసుపత్రులను ప్రత్యేక రక్షణ జోన్లుగా ప్రకటించాలని కోరామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డా.సుల్ఫీ ఎన్ చెప్పారు. కొత్త చట్టానికి దుండగుడి దాడిలో మరణించిన వైద్యురాలి పేరు పెట్టాలని కోరినట్లు చెప్పారు. తమ డిమాండ్లపై నిర్దిష్ట హామీ లభించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని ఐఎంఏ ప్రకటించింది.

మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలమిచ్చిన మైనర్ రెజ్లర్

న్యూఢిల్లీ: డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ తనను లైంగికంగా వేధించినట్లు ఆరోపించిన మహిళా రెజ్లర్లలో ఉన్న మైనర్ బాధితురాలి వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ ఎదుట రికార్డు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. సీఆర్‌పీసీ 164 సెక్షన్ కింద స్టేట్‌మెంట్ తీసుకున్నామని, మిగతా ఆరుగురు రెజ్లర్ల వాంగ్మూలాలను కూడా మెజిస్ట్రేట్ ఎదుట రికార్డు చేస్తామని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఇంతకుముందు సెక్షన్ 161 కింద ఏడుగురు మహిళా రెజ్లర్ల వాంగ్మూలాలను పోలీసులు సేకరించారు. బుధవారం ఢిల్లీ కోర్టు ఒకటి ఈ కేసులో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. బాధితులు కోర్టులో ఇచ్చే వాంగ్మూలాల రికార్డింగ్, దర్యాప్తు పర్యవేక్షణ కోసం రెజ్లర్ల ఫిర్యాదు చేయడంతో పోలీసులకు నోటీసును న్యాయమూర్తి జారీచేశారు. గతనెలలో బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లనూ ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన విషయం విదితమే.

కదిలే వాహనంలో విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

ప్రధాన నిందితుడి అరెస్టు - త్రిపురలో ఘటన

అగర్తల: కాలేజి విద్యార్థినిని కదిలే వాహనంలో గ్యాంగ్‌రేప్ చేసి, విషయ పరిస్థితిలో ఉన్న ఆమెను ఒంటరిగా వదిలి వెళ్లిన ఘటన త్రిపురలో జరిగింది. సోమవారం రాత్రి విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని, ఆమెకు జీబీ పంత్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని పోలీసులు గురువారం చెప్పారు. ప్రధాన నిందితుడు గౌతంశర్మను అరెస్టు చేసి, విచారిస్తున్నట్లు సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఆశీష్ దాస్‌గుప్తా విలేకరులకు తెలిపారు. అమ్మాయికి నిందితుడితో పరిచయం ఉన్నదని, ఇద్దరు కలిసే వెళ్లారని, రాత్రి ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకొని మరికొందరితో కలిసి లైంగిక దాడికి తెగబడి, ఆపై అమతలి బైపాస్ వద్ద అమ్మాయిని వదిలి కుర్రాళ్లు పరారైనట్లు చెప్పారు. మిగతా నేరస్తులు ఎవరన్నది ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారని, కాలేజి నుంచి ఇంటికి వస్తుండగా ఓ యువకుడు లిఫ్ట్ ఇస్తానంటే అమ్మాయి కారెక్కిందని, ఆమెపై ముగ్గురు త్యాచారానికి పాల్పడ్డారని, అనంతరం బైపాస్ వద్ద వదిలి పారిపోయారని, బంధువుల సమాచారంతో అక్కడకు వెళ్లగా తమ బిడ్డ అపస్మారక స్థితిలో ఉన్నదని, హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని ఫిర్యాదులో వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పపియా దత్తా, పార్టీ అనుబంధ మహిళా మోర్చా నేతలు ఆసుపత్రికి వెళ్లి బాధితురాలి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి మాణిక్‌సాహా ఆదేశాలతోనే ఆసుపత్రికి వెళ్లినట్లు దత్తా అనంతరం విలేకరులతో చెప్పారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా డిమాండు చేస్తామన్నారు.

శ్రీనగర్‌లో జీ-20 సదస్సు

భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ: శ్రీనగర్‌లో త్వరలో జీ-20 సదస్సు జరగనున్నది. ఈ నేపథ్యంలో జమ్ము ప్రాంతం ప్రత్యేకించి సరిహద్దు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 10కి పైగా సైనిక పాఠశాలలు మూసివేశారు. సరిహద్దుల నుంచి చొరబాట్లు జరిగే ప్రాంతాలను భద్రతా సంస్థలు గుర్తించాయని, చొరబాట్ల నివారణకు భద్రతను పెంచినట్లు అధికారులు గురువారం తెలిపారు. మే 22 నుంచి 24 వరకు శ్రీనగర్‌లోని దాల్ సరసు ఒడ్డున షేర్-ఐ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో మూడవ జీ-20 టూరిజం వర్కింగ్ గ్రూపు సమావేశం జరుగుతుంది. జమ్ములో ప్రత్యేకించి సరిహద్దు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశామని, కీలకమైన సైనిక, భద్రతా సంస్థలు మూసివేశామని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణారేఖ పొడవునా బహుముఖ భద్రతా వలయాలు ఏర్పాటు చేశామని, సైన్యం, సరిహద్దు భద్రతా దళాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, గ్రామరక్షణ కమిటీలను రంగంలో దించామని వివరించారు. జమ్ము, పఠాన్‌కోట్ జాతీయ రహదారి పొడవునా భద్రత, తనిఖీ పాయింట్లను పటిష్టవంతం చేశామని తెలిపారు. అన్ని వాహనాలు తనిఖీలు చేస్తున్నామని, వాహనాలు, ప్రజల కదలికలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికైనా వెళ్లే ముందు వాహనాలు తనిఖీ చేసుకోవాలని ప్రజలను పోలీసులు హెచ్చరించారు. పాఠశాలలు మూసివేసిన కారణంగా మే 25వ తేదీ వరకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

కేరళ మరో రికార్డు

అన్ని పోలీసు జిల్లాల్లో డ్రోన్ నిఘా వ్యవస్థ

అమలు చేసిన తొలి రాష్ట్రంగా నమోదు

తిరువనంతపురం: దేశంలోనే తొలిసారిగా కేరళలోని అన్ని పోలీసు జిల్లాల్లో డ్రోన్ నిఘా వ్యవస్థను ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 20 పోలీసు జిల్లాలకు ఒక్కో డ్రోన్‌ను అందించారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్‌లకు లైసెన్స్‌లు పంపిణీ చేశారు. దేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీ డ్రోన్ సాఫ్ట్‌వేర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన పోలీసు బలగాల ఆధునీకీకరణలో కేరళ ముందంజలో ఉందన్నారు. నేటి సమాజంలో డ్రోన్ల వినియోగం పెరిగినందున యాంటీ డ్రోన్ వ్యవస్థను అభివృద్ధి చేయడం ముఖ్యమన్నారు. శిక్షణ పొందిన డ్రోన్ పైలట్‌లు తాము నేర్చుకున్న వాటిని తమ సహోద్యోగులకు కూడా నేర్పించాలని సూచించారు. డ్రోన్ ఆపరేషన్‌పై ప్రత్యేక శిక్షణ కోసం 25 మంది పోలీసు సిబ్బందిని చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పంపారు. మరో 20 మందికి కేరళలోని డ్రోన్ ల్యాబ్‌లో ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం, విపత్తు నిర్వహణ సమయంలో ఈ డ్రోన్‌లను వినియోగిస్తామని సైబర్‌డోమ్ నోడల్ అధికారి ఐజీ ప్రకాశ్ తెలిపారు. "క్లిష్ట పరిస్థితుల్లోనే పోలీసు డ్రోన్లను ఉపయోగిస్తాం కాబట్టి మా సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. కొన్నిసార్లు సాధారణ డ్రోన్లు అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ వీటిని వినియోగిస్తాం. రాష్ట్ర స్థాయిలో డ్రోన్ ఫోరెన్సిక్ ల్యాబ్, యాంటీ డ్రోన్ వ్యవస్థను అభివృద్ధి చేసిన మొదటి రాష్ట్రం కేరళ. డ్రోన్ ఫోరెన్సిక్ ల్యాబ్ హానికరమైన డ్రోన్‌లను గుర్తించగలదు. వివరణాత్మక విశ్లేషణ కోసం వాటి నుంచి పూర్తి డేటాను తిరిగి పొందగలదు. అదే విధంగా, యాంటీ-డ్రోన్ వ్యవస్థ 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఇతర డ్రోన్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోగలదు. ప్రత్యర్థి డ్రోన్లను ఇది నాశనం చేయగలదు" అని ప్రకాశ్ తెలిపారు.

ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడికి ఈడీ సమన్లు

ముంబై: మహారాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు జయంత్ పాటిల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీచేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో శుక్రవారం (ఈ నెల 12న) విచారణకు హాజరుకావాలని తెలిపింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కుంభకోణం కేసులో పాటిల్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇదే వ్యవహారంలో ఇప్పటికే నవనిర్మాన్ సేన రాజ్ థాక్రేను ఈడీ ప్రశ్నించింది. కోహినూర్ సీటీఎన్ఎల్ పెట్టుబడుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ సంస్థకు ఎల్ఎఫ్ అండ్ ఎఫ్ పెట్టుబడులు సమకూర్చిందని, అయితే కోహినూర్ కన్‌స్ట్రక్షన్స్ తిరిగి ఆ సొమ్మును చెల్లించకపోవడంతో డీఫాల్టర్‌గా ప్రకటించారని పేర్కొంది. ఈ వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, కోహినూర్ సీటీఎన్ఎల్ దాదర్ వెస్ట్‌లో కోహినూర్ స్క్వేయర్ పేరుతో భారీ టవర్‌ను నిర్మిస్తున్నది.

నకిలీ నోట్ల కేసు... ముంబైలో ఎన్ఐఏ దాడులు

ముంబై: మహారాష్ట్రలోని థానెలో పెద్దఎత్తున నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ముంబైలోని ఆరు ప్రాంతాల్లో ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. నకిలీ నోట్ల తయారీ యంత్రాలు కనుగొన్నది. నకిలీ నోట్ల చెలామణిలో డి-కంపెనీ పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు ఎన్ఐఏ తెలిపింది. 2021 నవంబరులో థానె పోలీసులు రూ.2.98 లక్షల విలువైన నకిలీ నోట్లు పట్టుకున్నారు. ఈ కేసు విచారణ సమయంలో డి-కంపెనీ పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయిందని ఎన్ఐఏ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. విదేశాల్లో దాక్కున్న దావూద్ ఇబ్రహీం ముఠా నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు తెలుస్తోంది. నిందితులు, అనుమానితుల ఇళ్లు, కార్యాలయాలు సహా ముంబైలోని అనేక ఆస్తులపై ఎన్ఐఏ బుధవారం నుంచి దాడులు చేసినట్లు తెలిపింది. పదునైన ఆయుధాలు, డిజిటల్ డివైజ్‌లు, పత్రాలు సహా అనేక పరికరాలను స్వాధీనం చేసుకున్నామని, నకిలీ కరెన్సీ రాకెట్‌లో డి-కంపెనీకి నేరుగా సంబంధాలు ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయని ఎన్ఐఏ వివరించింది.

సచిన్ పైలట్ ధిక్కారం?

జన సంఘర్ష యాత్ర ప్రారంభం

అగర్తల: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, కాంగ్రెస్ అధిష్ఠానంపై పోరుకు ఆ పార్టీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ సిద్ధమయ్యారు. అధిష్ఠానం అనుమతి లేకుండానే గురువారం అజ్మీర్ నుంచి జన సంఘర్ష యాత్రను పైలట్ ప్రారంభించారు. బీజేపీ పాలనలో అవినీతి కేసులపై చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ సొంత పార్టీ ప్రభుత్వం లక్ష్యంగా సచిన్ పైలట్ ఏప్రిల్‌లో ఒకరోజు దీక్ష చేసిన విషయం విదితమే. పైలట్ జనసంఘర్ష యాత్ర ఐదురోజుల పాటు 125 కిలోమీటర్లు సాగుతుంది. యాత్ర ప్రారంభానికి ముందు అజ్మీర్‌లోని జైపూర్ జాతీయ రహదారిపై బహిరంగ సభలో పైలట్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ప్రశ్నపత్రాల లీకేజీ అంశాలను పైలట్ ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్రం, దేశం భవిష్యత్ యువతేనని పైలట్ వ్యాఖ్యానించారు. తన యాత్ర ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని, అవినీతి, యువత ప్రయోజనాల పరిరక్షణ కోసమేనని చెప్పారు. రెండేళ్లుగా గెహ్లాత్, పైలట్ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతోంది. 2020లో రాష్ట్ర నాయకత్వ మార్పు కోసం తిరుగుబాటు చేశారు. అయితే, గెహ్లాత్ చాకచక్యంగా తిరుగుబాటును అణచివేశారు. ఫలితంగా పైలట్, ఆయన మద్దతుదారులను రాష్ట్ర కేబినెట్ నుంచి తప్పించారు. ధన బలంతో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ నేతలు వసుంధర రాజే, కూలాశ్ మేఘ్వాల్ నిరాకరించడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు నుంచి ప్రభుత్వాన్ని కాపాడుకున్నానని ఆదివారం గెహ్లాత్ ఓ సభలో చెప్పారు. దీనికి ప్రతిగా గెహ్లాత్‌పై పైలట్ ఆరోపణలు గుప్పించారు. గెహ్లాత్‌కు వసుంధర రాజే నాయకురాలని, సోనియాగాంధీ కాదని విమర్శించారు. బీజేపీ నుంచి తాము డబ్బు తీసుకున్నారన్న గెహ్లాత్ ఆరోపణల్లో వాస్తవం లేదని పైలట్ చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ కొత్త ఇంటర్నెట్ కనెక్షన్‌కు ఇన్‌స్టలేషన్ చార్జీలు లేవ్

న్యూఢిల్లీ: బ్రాడ్‌బ్యాండ్ యూజర్లను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ కీలక నిర్ణయం తీసుకుంది. కనెక్షన్ తీసుకునే వారి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఎలాంటి ఇన్‌స్టలేషన్ ఛార్జీ వసూలు చేయబోమని తెలిపింది. బీఎస్ఎన్ఎల్ వివిధ రకాల ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. కాపర్ కనెక్షన్లతో పాటు ఫైబర్ ద్వారా కూడా ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త చందాదారులను చేర్చుకోవడమే లక్ష్యంగా ఇన్‌స్టలేషన్ ఛార్జీలను కొంత కాలం ఎత్తివేయాలని నిర్ణయించింది. కాపర్ కనెక్షన్లపై రూ.250 ఇన్‌స్టలేషన్ ఛార్జీల కింద బీఎస్ఎన్ఎల్ వసూలు చేస్తోంది. 'భారత్ ఫైబర్' కనెక్షన్లపై యూజర్లు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. కంపెనీ తీసుకున్న తాజా నిర్ణయం నేపథ్యంలో యూజర్లు ఎలాంటి ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. భారత్ ఫైబర్ ప్లాన్లు నెలకు రూ.329 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులు 20 ఎంబీపీఎస్ వేగంతో 1 టీబీ డేటా పొందుతారు. పరిమితి ముగిసిన తర్వాత వేగం 4 ఎంబీపీఎస్‌కు తగ్గుతుంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారుల కోసం ప్రత్యేక హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లను ఇస్తోంది. బీఎస్ఎన్ఎల్ ఫైబర్ రూరల్ హోం వైఫై ప్లాన్ కింద 30 ఎంబీపీఎస్ వేగంతో 1 టీబీ డేటా లభిస్తుంది.

స్వర్ణ దేవాలయం వద్ద మరోసారి పేలుళ్లు

అమృతసర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో వరుస పేలుళ్లు కలకలం రేపుతున్నాయి. అమృత్‌సర్‌లోని చారిత్రక స్వర్ణ దేవాలయం సమీపంలో మూడోసారి భారీ పేలుడు సంభవించింది. దీంతో ఆ ప్రాంతమంతా పేలుడు శబ్దాలతో దద్దరిల్లింది. గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో స్వర్ణ దేవాలయానికి సమీపంలోని హెరిటేజ్ స్ట్రీట్‌లో ఈ పేలుడు సంభవించింది. గత ఆరు రోజుల్లో ఇది మూడోసారి కావడం గమనార్హం. అయితే ఈ ఘటనకు పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు రాష్ట్ర జీడీపీ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. పంజాబ్‌లో శాంతి భద్రతలు, సామరస్యతను కాపాడేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే ఈ పేలుడు వెనుక వారి ఉద్దేశమని వెల్లడించారు. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరిస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దం వినిపించిందని నగర పోలీసు కమిషనర్ నౌనిహాల్ సింగ్ అన్నారు. భవనం సమీపంలో శిథిలాలను కనుగొన్నామని తెలిపారు. స్వర్ణదేవాలయానికి కు వెళ్లే మార్గంలో ఉన్న హెరిటేజ్ స్ట్రీట్ లో గత సోమవారం కూడా పేలుడు సంభవించింది. ఈ నెల 8న ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించారు. అయితే స్వర్ణ దేవాలయాన్ని సందర్శించేందుకు వచ్చిన భక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విపక్షాలు ఏకమైతే గెలుపు సాధ్యమే

నితీశ్‌కుమార్ స్పష్టీకరణ

ఉద్ధవ్ థాక్రేతో చర్చలు

ముంబై: విపక్షాల ఐక్యత కోసం బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా నితీశ్ ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖడ్గే, రాహుల్‌గాంధీ, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, ఒడిశా ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వంటి కీలక నేతలతో మంతనాలు జరిపారు. తాజాగా శివసేన(ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ థాక్రేను నితీశ్, ఆయన డిప్యూటీ, ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ గురువారం ముంబైలో కలిశారు. విపక్షాల ఐక్యత గురించి సుదీర్ఘ చర్చలు జరిపారు. కేంద్రంలో బీజేపీని ఓడించడటే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్ధవ్‌తో భేటీ అనంతరం నితీశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వస్తే...వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడం సులభమవుతుందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. 'అందరం కలిసి పనిచేస్తే బీజేపీపై పోరాటం పెద్ద కష్టమేమీ కాదు. ప్రతిపక్షాలు మంచి ఫలితాలు సాధిస్తాయి. దేశాన్ని సరైన దిశలో నడిపించవచ్చు' అని నితీశ్ స్పష్టంచేశారు. తదుపరి సమావేశం ఎక్కడ నిర్వహించేది ప్రతిపక్ష పార్టీలు నిర్ణయిస్తాయని తెలిపారు. 'మా లక్ష్యం ఒక్కటే...దేశ ప్రయోజనాల కోసం పనిచేయడం' అని వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షాల్లో ఎవరి మధ్యా వివాదం లేదు. అందరం ఏకతాటిపైకి రావడం తథ్యం' అని నితీశ్ చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల ఐక్యతను మరింత పటిష్టవంతం చేయడంలో భాగంగా ఉద్ధవ్ థాక్రేను నితీశ్ కలిశారు.

ఇసుక మైనింగ్‌తో బీహార్‌కు రికార్డు ఆదాయం

గతేడాదితో పోల్చితే 54 శాతం పెంపుదల

పాట్నా: ఇసుక మైనింగ్ ఆదాయంలో బీహార్ ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పింది. 2022-23లో రూ.1384.46కోట్లు ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చినదానికంటే ఇది దాదాపు 54శాతం అధికమని ఉన్నతాధికారి ఒకరు గురువారం తెలిపారు. ఇసుక మైనింగ్ ద్వారా 2021-22లో రూ.745.44 కోట్లు రాగా తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అందుకు 53.84 శాతం అధికంగా సమకూరిందని బీహార్ అదనపు ప్రధాన కార్యదర్శి, గనుల కమిషనర్ హర్‌జోత్ కౌర్ బమ్రా వెల్లడించారు. గనులు, ఖనిజాల నుంచి వచ్చే ఆదాయం గత కొన్నేళ్లుగా పెరిగిందన్నారు. 2017-18లో రూ.1082.72కోట్లు ఉన్న ఆదాయం 2022-23కి రూ.3000 కోట్లకు పెరిగిందని తెలిపారు. అలాగే ఇసుక మైనింగ్ ఆదాయం 2018-19లో రూ.836.57 కోట్లు కాగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.1384.46కి చేరిందని వెల్లడించారు. తద్వార మొత్తంగా గనులు, ఖనిజాల ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగిందని చెప్పారు. ఇటుక బట్టీల యజమానుల నుంచి రూ.77.93కోట్లు 2022-23లో ఆర్జించినట్లు వెల్లడించారు. 2021-22లో రూ.71కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. 2022-23లో రూ.299కోట్లను అక్రమ మైనింగ్‌పై జరిమానాల రూపేణ పొందినట్లు తెలిపారు. 2021-22లో రూ.165కోట్లు జరిమానాల రూపేణ సమకూరాయని అన్నారు. అక్రమ ఇసుక మైనింగ్, ఖనిజాల దోపిడీ నివారణకు నిబద్ధతగల పోలీసు దళాన్ని ఏర్పాటు చేయాలని శాఖ నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం మైనింగ్ పోలీసులుగా 25 మంది అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్లు, 250 మంది కానిస్టేబుళ్లతో పాటు సీనియర్ అధికారులు కావాలని, వీరు సాయుధులై ఉండాలన్నారు. ఈ ప్రతిపాదనను ఆమోదం కోసం సంబంధిత యంత్రాంగానికి పంపినట్లు కమిషనర్ వెల్లడించారు.

పథకం ప్రకారమే మణిపూర్‌లో హింస

కాంగ్రెస్ నేత భక్త చరణ్‌దాస్ విమర్శ

న్యూఢిల్లీ: పథకం ప్రకారమే మణిపూర్‌లో హింస రాజ్యమేలిందని, శాంతి, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకుగాను రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కాంగ్రెస్ పార్టీ గురువారం డిమాండ్ చేసింది. హింసలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు, దెబ్బతిన్న ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మణిపూర్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి భక్త చరణ్‌దాస్ ఇక్కడ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు వైద్య సేవలు అందించాలని, బాధితులు తిరిగి సొంత ఇళ్లకు వచ్చేందుకు వీలుగా శాంతియుత వాతావరణం సృష్టించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితిని అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హింసను కట్టడి చేయడంలోనూ, ఆయుధాల దోపిడీని అడ్డుకోవడంలో, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలోనూ వైఫల్యం చెందిందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం సామాన్యులను కాపాడలేకపోయిందన్నారు. సహాయ శిబిరాల్లో బాధితులకు సరైన వసతులు కల్పించలేదని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికీ హింస ఆగడం లేదని ఆయన చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేయడం లేదని ఆరోపించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తే మరింత జవాబుదారీతనం ఏర్పడుతుందని కాంగ్రెస్ నాయకుడు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస పర్యవేక్షణ లేకపోవడంతో పథకం ప్రకారమే హింస చోటుచేసుకుందని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇప్పటి వరకు మణిపూర్‌లో పర్యటించలేదని, ప్రధాని నరేంద్రమోదీ కనీసం ట్వీట్ కూడా చేయలేదని మండిపడ్డారు.

50 వేల ఇంటిపట్టాలు రెడీ

- అమరావతిలో 21 లేఔట్లలో ప్లాట్ల అభివృద్ధి
- ఎస్-3జోన్‌లో 268 ఎకరాల కేటాయింపు
- పనుల పురోగతిపై సీఎం జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి రాజధాని ప్రాంతంలో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 50 వేలమందికి సెంటు చొప్పున ఇంటిపట్టాలు ఇవ్వడానికి శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఓవైపు ఆర్-5జోన్ ఏర్పాటుపై కోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్నది. మరోవైపు రాజధానిలో ఇంటి స్థలాలు ఇవ్వడాన్ని గ్రామసభల్లో ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఆర్-5జోన్‌లో కేటాయించిన 1134 ఎకరాలకు అదనంగా ఎస్-3జోన్‌లో మరో 268 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వీటి పనుల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్షించారు. రాజధాని ప్రాంతంలో ఒకేసారి 50 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడం, వారి చిరకాల వాంఛ నెరవేర్చే బృహత్తర కార్యక్రమంగా సీఎం అభివర్ణించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 21 లే అవుట్లలో 1402.58 ఎకరాల్లో 50,004 మందికి పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వివరించారు. వీటిలో గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారులకు 10 లే అవుట్లలో, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లబ్ధిదారులకు 11 లే అవుట్లలో ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ స్థలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్, భూ చదును పనులు ముగిశాయని, దాదాపు 180 కిలోమీటర్ల మేర అంతర్గత గ్రావెల్ రోడ్లు వేయడానికి పనులు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టుకు అదనపు భవన నిర్మాణం కూడా పూర్తవుతోందని తెలిపారు. మొత్తం 76,300 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ భవనం అందుబాటులోకి వస్తోందని, 14 కోర్టు హాళ్లకు అవసరమైన సదుపాయాల కల్పన జరుగుతోందని వివరించారు. అనంతరం టిడ్కో ఇళ్లపైనా సీఎం సమీక్షించారు. టిడ్కో ఇళ్లలో మొదటిదశకు సంబంధించి 1,50,000 ఇళ్లకుగాను 1.39 లక్షలు ఇళ్లు పూర్తయ్యాయని, 30 ప్రాంతాల్లో 51,564 ఇళ్లు అప్పగించామని అధికారులు తెలిపారు. జూన్ నాటికి మొత్తం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని, రెండో విడతకు సంబంధించిన 1,12,092 ఇళ్లను సెప్టెంబరు-డిసెంబరు మధ్యకాలంలో పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. విశాఖపట్నంలో బీచ్‌ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, విజయవాడలో కృష్ణానది వరద ముప్పు నుంచి తప్పించేందుకు నిర్మించిన రిటైనింగ్ వాల్ ద్వారా ఏర్పడిన రివర్ బెడ్‌ను వాకింగ్ ట్రాక్‌తో సహా అందంగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. సమీక్షా సమావేశానికి పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.బసంత్ కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రీ సర్వే ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ సుబ్బారావు, మెప్మా ఎండీ విజయలక్ష్మి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మా గెలుపు తథ్యం

- రెజ్లర్ల దీమా
- నల్లబ్యాండ్లతో నిరసన
- దిగ్బంధానికి మద్దతిచ్చిన రైతు సంఘాలు

న్యూదిల్లీ: తమ పోరాటానికి బలం పెరుగుతోందని, న్యాయపోరాటంతో తప్పక గెలుస్తామని మహిళా రెజ్లర్లు విశ్వాసంగా చెప్పారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై చర్యలకు డిమాండ్ చేస్తూ రెజ్లర్లు చేపట్టిన ఆందోళన 18వ రోజుకు చేరుకుంది. తలకు నల్లబ్యాండ్లు ధరించి గురువారం బ్లాక్‌డేను వారు పాటించారు. ఆందోళనలో వినేశ్‌ఫోగాట్, బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, సత్యవర్త్ కైద్యాన్, జితేంద్ర కిన్హా తదితరులు పాల్గొన్నారు. మద్దతుదారులు సైతం చేతికి నల్లబ్యాండ్లు ధరించి సంఘీభావం తెలిపారు. 'మా పోరాటానికి మొత్తం దేశం మద్దతిస్తోంది. మా గెలుపు తథ్యం. రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. న్యాయపోరాటం మరింత తీవ్రతరమవుతోంది. బ్రిజ్‌భూషణ్‌పై చర్యల కోసం బ్లాక్‌డేను పాటించాం' అని నిరసనకారులు తెలిపారు. భారత కిసాన్ యూనియన్ ఏక్తా (ఆజాద్) మహిళా సభ్యులు, మజ్దూర్ అధికార్ సంఘటన్, సోనిపట్‌తో పాటు భగత్‌సింగ్ యూత్ యూనియన్, మహారాష్ట్ర ప్రతినిధులు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు.

కోడికత్తి కేసు మరోసారి వాయిదా

జూన్ 15న విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోడికత్తి కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసులో బాధితుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకు కోర్టుకు హాజరు కాకపోవడంతో వాయిదా పడుతూ వస్తుండగా, గురువారం ఎన్ఐఏ తరపున లాయర్ హాజరుకాకపోవడంతో పాటు, వేసవి సెలవుల కారణంగా కేసు విచారణను జూన్ 15వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఇప్పటివరకు ఈ కేసుపై వాదనలు విన్న ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి ఇటీవల పదోన్నతిపై కడపకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో నూతనంగా వచ్చిన న్యాయమూర్తి మొదటి నుంచి పిటిషన్‌లపై వాదనలు జరగాల్సి ఉంది. గురువారం ఎన్ఐఏ తరపు న్యాయవాదలు ఎవరూ హాజరుకాకపోవడంతో కేసు విచారణను కోర్టు జూన్ 15కు వాయిదా వేసింది. కేసు విచారణ నిమిత్తం నిందితుడు జనిపల్లి శ్రీను అలియాస్ కొడికత్తి శ్రీనును రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి విజయవాడకు తీసుకువచ్చారు. నిందితుని తరపు న్యాయవాది అబ్దుల్ సలీం కూడా కోర్టుకు వచ్చారు. అయితే విచారణను కోర్టు వాయిదా వేసిన నేపథ్యంలో నిందితుడిని తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

చత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసు

ఈడీ అదుపులో మరో ఇద్దరు

రాయ్‌పూర్ మేయర్ సోదరుడి కస్టడీ పొడిగింపు

రాయ్‌పూర్/న్యూదిల్లీ: చత్తీస్‌గఢ్ మద్యం సిండికేట్‌తో ముడిపడ్డ మనీలాండరింగ్ కేసులో మద్యం వ్యాపారవేత్తతో పాటు హోటల్ వ్యాపారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లోని గిరిరాజ్ హోటల్ ప్రామోటర్ నితీశ్ పురోహిత్‌ను బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేయగా, పప్పు ధిల్లాన్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మద్యం కుంభకోణంలో తనను ఇరికించేందుకు ఈడీ యత్నిస్తోందని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ ఆరోపించారు. బీజేపీకి ఏజెంటుగా ఈడీ వ్యవహరిస్తోందని రాయ్‌పూర్‌లో పోలీస్‌లైన్స్ హెలిప్యాడ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు. రాయ్‌పూర్ మేయర్, కాంగ్రెస్ నేత ఐజాస్ ధేబర్ అన్నయ్య అన్వర్‌ను ఇదే కేసులో ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అన్వర్ అక్రమ కార్యకలాపాల గురించి పురోహిత్‌కు తెలుసునని, ఈ నేరంలో అనిల్ తుతేజా (చత్తీస్‌గఢ్ కేడర్ ఐఏఎస్ అధికారి)కి పురోహిత్ ఇష్టపడే సహకరించినట్లు బుధవారం కోర్టుకు ఈడీ తెలిపింది. రాయ్‌పూర్‌లోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో అన్వర్‌ను ప్రవేశపెట్టగా ఆయనకు నాలుగు రోజుల రిమాండు విధించిన న్యాయస్థానం తర్వాత దానిని ఐదు రోజులకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది.

అపోలో క్యాన్సర్ సెంటర్ ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ ఆరిలోవలో అపోలో క్యాన్సర్ సెంటర్ (ఏసీసీ)ని ప్రారంభించారు. అపోలో ఆసుపత్రి ప్రాంగణంలో 54వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో క్యాన్సర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇది ట్రూ బీమ్ ఎస్‌టీఎక్స్ టెక్నాలజీ కలిగిన ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి, ఏకైక క్యాన్సర్ కేంద్రమని ఆసుపత్రి ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేయస్ విశ్వనాథన్, శాసనసభ్యులు వాసుపల్లి గణేశ్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, నెట్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ చైర్మన్, డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు బకాయిల మళ్లింపుపై నిర్ణయానికి పింఛన్‌దారులకు మూడు నెలల గడువు

న్యూదిల్లీ: ఉద్యోగుల పింఛన్ పథకం (ఈపీఎస్) పరిధిలో అదనపు నిధులు లేక బకాయిలను మళ్లించే విషయంలో తమ నిర్ణయాన్ని తెలిపేందుకు అధిక పింఛన్ కోరుకునే వినియోగదారులకు మూడు నెలల గడువు ఉంటుందని ఈపీఎఫ్ఓ వెల్లడించింది. అధిక పింఛన్‌ను ఎంపిక చేసుకునేందుకుగాను వినియోగదారులకు నాలుగు నెలల సమయం ఇవ్వాలని ప్రభుత్వానికి 2022 నవంబరులో సుప్రీంకోర్టు సూచించింది. ఈపీఎఫ్ఓ ఆన్‌లైన్ ద్వారా జాయింట్ ఆప్షన్ ఫారం (యజమానులతో కలిపి) వినియోగారులకు అందుబాటులో ఉంచింది. తద్వార అధిక పింఛన్ కావాలంటే మే 3వ తేదీ వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించింది. ఆ తర్వాత గడువు కాలాన్ని జూన్ 26 వరకు పొడిగించింది. అయితే పింఛన్ ప్రక్రియ అమలుపై స్పష్టత లోపించింది. అధిక పింఛన్ పథకం నుంచి ఉపసంహరించుకునే వెసులుబాటు ఉంటుందో లేదో సభ్యులకు అవగాహన లేదు. ఇటీవల కార్మికశాఖ కూడా ఇదే విషయంపై స్పష్టతిచ్చింది. వేతనాల్లో బేసిక్‌పై 1.16శాతం అదనపు తోడ్పాటు యాజమాన్యాల తరపున ఈపీఎఫ్ఓ ద్వారా జరుగుతుందని వెల్లడించింది. ప్రావిడెంట్ ఫండ్‌కు యాజమాన్యాలు సమకూర్చే 12 శాతం నుంచి 1.16శాతాన్ని తీసుకోవాలని నిర్ణయించినట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

స్వలింగ వివాహాల చట్టబద్ధతపై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూదిల్లీ: స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన వివిధ పిటిషన్లపై సుప్రీం కోర్టులో గురువారం వాదనలు పూర్తయ్యాయి. వీటిపై 10 రోజులపాటు సుదీర్ఘ విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్వలింగ వివాహాల చట్టబద్ధతకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. స్వలింగ వివాహాలకు గుర్తింపునిచ్చే అంశం చాలా సంక్లిష్టమైనదని, సమాజంపై లోతైన ప్రభావాన్ని చూపించే ఈ అంశాన్ని పార్లమెంటుకు వదిలివేయాలని సూచించింది. రాష్ట్రాల చట్టసభలతో పాటు పౌర సమాజంలోనూ దీనిపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనిపై బుధవారం కూడా వాదనలు వినిపించిన కేంద్ర ప్రభుత్వం స్వలింగ వివాహాలకు చట్టబద్ధతపై ఎటువంటి ప్రకటన చేసినా అది సరైన చర్య కాదని స్పష్టం చేసింది. స్వలింగ వివాహాల చట్టబద్ధతపై దాఖలైన పిటిషన్లను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి మార్చి నెలలో సుప్రీంకోర్టు సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎస్ఆర్ భట్, జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ పీఎస్ నరసింహలు ఉన్నారు. ఈ కేసు ఫర్టిలిటీ అంశానికి సంబంధించినది కావడంతోపాటు రాజ్యాంగ హక్కులు, ప్రత్యేక వివాహ చట్టం, ప్రత్యేక శాసనాలతో ముడిపడి ఉండటంతో రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నట్లు చెప్పింది. తాజాగా వీటిపై సుదీర్ఘ వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, రాజు రామచంద్రన్, కేవీ విశ్వనాథన్, ఆనంద్ గ్రోవర్, సౌరభ్ కర్పాల్‌లు వాదించారు.

ఈ సారి పర్‌ఫార్మెన్స్ బద్దలైపోద్ది

హైదరాబాద్: టాప్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. పవర్ స్టార్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్‌ను ఫస్ట్ గ్లింప్స్ రూపంలో విడుదల చేసింది. ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్‌బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. హరీష్ శంకర్, పవన్ కల్యాణ్ కాంబోలో మరో మాస్ విజువల్ ట్రీట్ ఉండబోతుందని తాజా లుక్‌తో అర్థమవుతోంది. పవన్ కల్యాణ్ మరోవైపు వినోదయ సీతమ్ రీమేక్‌తోపాటు హరిహరవీరమల్లు సినిమాల్లో కూడా నటిస్తున్నాడు పవన్ కల్యాణ్. వీటికి సంబంధించిన కొత్త అప్‌డేట్స్ రావాల్సి ఉన్నాయి. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఓజీ షూటింగ్ కూడా జెట్ స్పీడులో కొనసాగుతోంది. పవన్ కల్యాణ్ ఒకదాని తర్వాత మరొక షెడ్యూల్ ప్లాన్ చేసుకుంటూ.. బ్యాక్ టు బ్యాక్ సినిమాల చిత్రీకరణలో పాల్గొంటూ.. అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్ మెంట్ అందించేందుకు రెడీ అవుతున్నట్టు తాజా స్టిల్ చెబుతోంది.

వజ్ర కాళేశ్వరి దేవిగా అపర్ణాదాస్

హైదరాబాద్: యువ హీరో పంజా వైష్ణవ్‌తేజ్ ప్రస్తుతం తన నాలుగో చిత్రంలో నటిస్తున్నారు. శ్రీలీల నాయికగా కనిపించనుంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఎస్. నాగవంశీ. ఎస్. సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడు. ఈ చిత్రంలోని కీలక పాత్రకు నటి అపర్ణా దాస్‌ను ఎంపిక చేసినట్లు తాజాగా చిత్రబృందం వెల్లడించింది. 'మనోహరం', 'బీస్ట్' వంటి చిత్రాలతో మలయాళ, తమిళ చిత్ర పరిశ్రమల్లో ఆమె గుర్తింపు తెచ్చుకుంది. ఈ చిత్రంలో అపర్ణ వజ్ర కాళేశ్వరి దేవి పాత్రలో కనిపించనుంది. కథలో ఈ పాత్ర కీలకంగా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్లైమాక్స్ అదిరిపోతుందట

హైదరాబాద్: రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'గేమ్ ఛేంజర్' గురించి కొత్త విషయాన్ని వెల్లడించారు దర్శకుడు శంకర్. చిత్రీకరణ తుది అంకంలో ఉన్న ఈ సినిమాక్లైమాక్స్‌ను తాజాగా పూర్తి చేశామని, ఈ పతాక సన్నివేశాలు అదిరిపోతాయని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యిందని, ఇక తన తదుపరి సినిమా 'ఇండియన్ 2'పై దృష్టి పెట్టబోతున్నట్లు శంకర్ చెప్పారు. సామాజిక అంశాలున్న రాజకీయ నేపథ్య చిత్రంగా 'గేమ్ ఛేంజర్' తెరకెక్కుతున్నది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ నాయికగా నటిస్తున్నది. వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో పాటు రామ్‌చరణ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్నారు.

మహా సంక్షోభం సాగిందిలా

ముంబై: శివసేనలో ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు కారణంగా గతేడాది మహారాష్ట్ర రాజకీయాల్లో సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. చివరకు మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం కూలిపోయి షిండే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు అయింది. ఆ సమయంలో గవర్నర్ వ్యవహరించిన తీరు, తిరుగుబాటు ఎమ్మెల్యేల అనర్హత వంటి అంశాలపై ఉద్ధవ్ ఠాక్రే, షిండే వర్గాలు దాఖలు చేసిన అనేక పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. షిండే వర్గానికి చెందిన భరత్ గోగావలేను శివసేన విప్‌గా స్పీకర్ నియమించడం అక్రమమని పేర్కొన్న సుప్రీం కోర్టు ముఖ్యమంత్రిగా షిండేను ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ తీరును తీవ్రంగా తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో సంక్షోభం నెలకొన్న నాటి నుంచి ఇప్పటివరకు మహారాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న కీలక పరిణామాలను పరిశీలిద్దాం.

2022 జూన్ 20: మహారాష్ట్రలో జూన్ 20న శాసనమండలి ఎన్నికలు పూర్తయ్యాయి. ఓటింగ్ జరిగిన వెంటనే శివసేన సీనియర్ నేత ఏక్‌నాథ్ షిండే కనిపించకుండా పోయారు. ఆయన మరో 11 మంది ఎమ్మెల్యేలు గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్నట్లు తేలింది.

జూన్ 21: మండలి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని అనుమానించిన ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రే శివసేన ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. అనంతరం అసెంబ్లీలో శివసేన పార్టీ నేత బాధ్యతల నుంచి షిండేని తొలగించారు.

జూన్ 22: అదే సమయంలో షిండే నేతృత్వంలోని 40 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు సూరత్ నుంచి అసోంలోని గువహటీకి మకాం మార్చారు. గుజరాత్, అసోం రెండూ బీజేపీ పాలిత రాష్ట్రాలే.

జూన్ 23: శివసేన శాసనసభా పార్టీ నేతగా షిండేని తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. అదే రోజు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ 16 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసులు జారీచేశారు. ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రే అధికార నివాసం వర్షా నుంచి మాతోశ్రీకి మకాం మార్చారు.

జూన్ 26: డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని తోసిపుచ్చడాన్ని షిండే వర్గం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. 27న విచారించిన సుప్రీంకోర్టు అనర్హత అంశాన్ని నిలిపివేయడంతో ఎమ్మెల్యేలకు ఊరట కలిగినట్లు అయ్యింది.

జూన్ 29: ఎంవీఏ ప్రభుత్వం అవిశ్వాసం ఎదుర్కోవాలన్న మహారాష్ట్ర గవర్నర్ ఆదేశాలను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో తొమ్మిది రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తెరదించుతూ అవిశ్వాసాన్ని ఎదుర్కోకుండానే ముఖ్యమంత్రి పదవికి ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేశారు.

జూన్ 30: ఠాక్రే రాజీనామా చేసి 24 గంటలు గడవకముందే ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్ ప్రమాణ స్వీకారం చేశారు.

జూన్ 3-4: అసెంబ్లీ రెండు రోజుల ప్రత్యేక సమావేశం జరిగింది. స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. జులై 4న నిర్వహించిన విశ్వాసపరీక్షలో షిండేకు మద్దతుగా 164ఓట్లు, వ్యతిరేకంగా 99 ఓట్లు వచ్చాయి.

ఆగస్టు 23: పార్టీ ఫిరాయింపులు, విలీనం, అనర్హత అంశాలపై శివసేనతోపాటు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే లేవనెత్తిన అనేక ప్రశ్నలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేసింది.

అక్టోబర్ 8: అంధేరీ ఈస్ట్ అసెంబ్లీ ఎన్నికకు ముందు శివసేన పార్టీ ఎన్నికల గుర్తుపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. తాత్కాలికంగా ఆ రెండు వర్గాలకు వేర్వేరు గుర్తులను కేటాయించింది.

2023 ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన పార్టీ అని ఎన్నికల సంఘం పేర్కొంది. ఆ వర్గానికే 'బాణం-విల్లంబులు' గుర్తు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఫిబ్రవరి 21: రాజ్యాంగపరమైన అంశాలను సవాలు చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే, షిండే వర్గాలు దాఖలు చేసిన అనేక పిటిషన్ల తుది విచారణను సుప్రీం ధర్మాసనం ప్రారంభించింది.

మార్చి 16: మహారాష్ట్ర రాజకీయ సంక్షోభానికి సంబంధించి శివసేనలోని రెండు వర్గాల పిటిషన్ల విచారణ పూర్తిచేసిన సుప్రీం ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.

మే 11: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండేని కొనసాగవచ్చని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు వెలువరించింది. బలపరీక్షను ఎదుర్కోకుండా ఉద్ధవ్ ఠాక్రే స్వచ్ఛందంగా రాజీనామా చేసినందున మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని తిరిగి పునరుద్ధరించలేమని పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.